**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 60, పేజీలు - 08

బుధవారం, ఆగష్టు 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలి

### - అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



- మూసీ ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులకు ఆదేశం
- ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి పెట్టాలని కమిషనర్లకు సూచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న ఈ మూసీ ప్రాజెక్టు పురోగతిపై మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించారు.

2లో..

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ

### - కులగణనపై కీలక సూచన



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కులగణనలో వివరాల సేకరణ విధానంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఇద్దరూ సంయుక్తంగా లేఖ రాశారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానాన్ని మార్చి.. కులాల పేర్లతో కూడిన డ్రాప్‌డౌన్ జాబితాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విధానంలో వ్యక్తులు తమ కులం పేరును ఎలా చెబితే అలా నమోదు చేస్తారని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. ఒకే కులానికి ప్రాంతాలను బట్టి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా రూపాలు ఉండే అవకాశం ఉందని

2లో..

## కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు తప్పదా..?

### - పీసీసీకి అందిన నివేదిక

- వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమన్న మల్లు రవి
- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రతిపాదించినట్లు సమాచారం
- చిన్నారెడ్డిని ప్లానింగ్ కమిషన్ నుంచి తొలగించాలని సూచించినట్లు సమాచారం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ లో రాజకీయ ఉత్కంఠ రేపుతోంది. మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదిక అందజేసింది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.

2లో..

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

- 22ఏ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి


2లో..

## 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు

### - నిర్వహణ ఏర్పాట్లపై సీఎం సమీక్ష

- వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ
- రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ
- భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం
- పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో

2లో..

## స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు

### - నేతలకు వైఎస్ జగన్ పిలుపు

అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ,

2లో..



## అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు

2లో..

- రేవంత్ అమెరికా టూర్‌పై కిషన్‌రెడ్డి ఫైర్



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి

### - వైసీపీ డ్రామాలను నమ్మొద్దన్న నారా లోకేశ్



అమరావతి (ప్రశ్న న్యూస్) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

2లో..

## రాత్రివేళ ప్రయాణానికి ఇక ఢోకా లేదు

2లో..

- ఆరు ప్రధాన మార్గాల్లో ఆర్టీసీ బస్సులు
- రాత్రి 10.30 నుంచి ఉదయం 5 వరకు



## దీక్ష విరమించినా ఫీజు రీయింబర్స్మెంట్ పై పోరాటం ఆగదు

### - నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన ఎంపీ కె. లక్ష్మణ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేపట్టిన దీక్ష ముగిసింది. రామచందర్‌రావుకు నిమ్మరసం ఇచ్చి బీజేపీ నేత లక్ష్మణ్ దీక్ష విరమింపజేశారు. సోమవారం ఉదయం 11 నుంచి మంగళవారం మధ్యాహ్నం 2 వరకు దీక్షలో పాల్గొన్నారు. దీక్ష విరమణకు వైద్యులు ఆయనను పరీక్షించినప్పుడు బీపీ 390/60కి పడిపోయింది. దీక్ష విరమించినా ఫీజు రీయింబర్స్మెంట్పై బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,



ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ కేసులు

### - ఐసీఎంఆర్ చీఫ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలోని పలు ప్రాంతాల్లో స్వైన్ ఫ్లూ (హెచ్1ఎన్1) కేసులు నమోదవుతున్న సంగతి తెలిసిందే. అయితే దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కేసుల సంఖ్య గతంతో పోలిస్తే విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అయితే స్వైన్ ఫ్లూ కేసుల వల్ల భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ చెప్పారు. దేశంలో స్వైన్ ఫ్లూ కేసులకు సంబంధించిన కొత్త రకం వైరస్ ఏదీ వ్యాపించలేదని తెలిపారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న వైరస్ ఇదివరకే ఉనికిలో ఉన్న ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) అని ఆయన తెలిపారు.



2లో..

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలి

భూసేకరణ నుంచి టెండర్ల వరకు కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భూముల సమీకరణకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మరీ ముఖ్యంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్ అంశాలపై రూల్స్‌కు అనుగుణంగా సమగ్ర విధానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. భూసేకరణ విషయంలో భవిష్యత్‌లో న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, చట్టపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధుల కోసం తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంశంపై ప్రతి వారం అధికారులు సమీక్ష నిర్వహించాలని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మూసీ ప్రాజెక్టుతో అనుసంధానమైన మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం పనులకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.

అలాగే కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించి మరింతమంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు భూసేకరణ, ఫేజ్-2 టెండర్లు, టీడీఆర్, అనుబంధ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తాజా సమీక్ష స్పష్టం చేసింది.

## ప్రధాని మోదీకి రాహుల్, ఖర్గే లేఖ

తెలిపారు. దీంతో ఒకే కులానికి చెందినవారి వివరాలు వేర్వేరు పేర్లతో నమోదైతే.. ఆ కులం వేలాది ఎంట్రీలుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా జరిగితే కులాల జనాభాపై కచ్చితమైన సమాచారం లభించదని తెలిపారు. ఫలితంగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల స్థితిగతులపై సరైన అంచనా సాధ్యం కాదన్నారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై దీని ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఓబీసీల వాస్తవ జనాభా ఎంత అన్నది కూడా తేలకపోవచ్చని కాంగ్రెస్ నేతలు అన్నారు. కులగణనలో 'బ్యాక్‌వర్డ్ క్లాస్' అనే పదం చేర్చలేదని లేఖలో ప్రస్తావించారు. కులాల పేర్లతో డ్రాప్‌డౌన్ జాబితా రూపొందించాలని వారు సూచించారు. ఎస్సీ, ఎస్టీల గణనలో ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రభుత్వ జాబితాలు, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా వివరాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించవచ్చన్నారు. తెలంగాణ, బీహార్ కుల సర్వేల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి.. రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ కోరారు.

## కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు తప్పదా.?

కొండా సురేఖ పార్టీ నియమావళి ఉల్లంఘించడం ఇది తొలిసారి కాదని కమిటీ నివేదికలో స్పష్టం చేసింది. చిన్నారెడ్డిని కూడా ప్రణాళిక సంఘం ఛైర్మన్ పదవి నుంచి తొలిగించాలని సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇద్దరిపై నివేదిక సిద్ధం చేసి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ కు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి అందజేశారు. ఇక కాంగ్రెస్ కమిటీలో క్రమశిక్షణ ప్రధానమైనదని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. పార్టీపై గౌరవం ఉంటేనే మళ్లీ పార్టీ అధికారంలోకి వస్తుందని పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఈ మేరకు నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసేలా పనులు ఎవరూ చేయొద్దని వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడొద్దని తెలిపారు. 'ఈ నివేదికను పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ చీఫ్ కు అందచేశాం. నివేదికను ఇన్ ఛార్జి మీనాక్షీ నటరాజన్ కు కూడా పంపారు. ఏఐసీసీ చీఫ్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీకి కూడా నివేదిక పంపిస్తారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి. లెటర్ లో ఏముందో చెప్తే నాకు నోటీసులు వస్తాయి. మా రిపోర్ట్ లో అన్ని విషయాలు పొందు పరిచాం' అని మల్లు రవి వెల్లడించారు. ఇక కొద్దిసేపట్లో మల్లు రవి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి నివేదిక అందించనున్నారు. ఇక కమిటీ నివేదిక నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు.

"భూములను 22ఏలో పెట్టడం మీ వంతు, మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు.

మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రాత్రివేళ ప్రయాణానికి ఇక ధోకా లేదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ ఆర్టీసీ ప్రయాణికులకు తీపి కబురు. నగరంలో పెరుగుతున్న నైట్‌లైఫ్, నైట్‌షిఫ్ట్ ఉద్యోగుల అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణాను అందుబాటులోకి తీసుకురావడానికి గ్రేటర్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. అర్ధరాత్రి తర్వాత బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, సామాన్య ప్రయాణికులకు ఊరట కల్పించేలా నగరంలోని ప్రధాన మార్గాల్లో ప్రత్యేకంగా థర్డ్‌షిఫ్ట్ బస్సులు నడపాలని నిర్ణయించింది. తొలి దశలో నగరంలోని ఆరు రద్దీ ప్రధాన కారిడార్లను ఎంపిక చేసి, ఒక్కో మార్గంలో కనీసం ఐదు బస్సుల చొప్పున మొత్తం 30 బస్సులను నడపాలని అధికారులు భావిస్తున్నారు. ఈ బస్సులు రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు అందుబాటులో ఉండనున్నాయి. ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రారంభించి ప్రయాణికుల స్పందన, బస్సుల ఆక్యుపెన్సీ ఆధారంగా మరిన్ని మార్గాలకు విస్తరించాలని ఆర్టీసీ యోచిస్తోంది. మేడ్చల్--గచ్చిబౌలి (195), కొండాపూర్--సికింద్రాబాద్ (10హెచ్), కోఠి-పటాన్ చెరు (218), కోఠి-పటాన్‌చెరు (222ఏ), హయత్‌నగర్ -జేబీఎస్ (290యూ), సింద్రాబాద్- పటాన్‌చెరు (219) మార్గాలు నగరంలోని కీలక ఐటీ హబ్‌లను వివిధ నివాస ప్రాంతాలతో అనుసంధానిస్తాయి. దీంతో రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఐటీ, బీపీవో, ఇతర నైట్‌షిఫ్ట్ ఉద్యోగులకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రస్తుతం అర్ధరాత్రి తర్వాత ప్రజా రవాణా పరిమితంగా ఉండటంతో నైట్‌షిఫ్ట్ ఉద్యోగులు క్యాబ్‌లు, ఆటోలు, వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. కొత్త బస్సు సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణ ఖర్చు తగ్గడంతోపాటు రాత్రి వేళల్లో ప్రజా రవాణా భద్రత కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

థర్డ్‌షిఫ్ట్ బస్సుల వల్ల ఇతర ప్రాంతాల నుంచి తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకునే ప్రయాణికులకు కూడా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్‌లకు రాత్రిళ్లు, తెల్లవారుజామున చేరుకునే వారికి ప్రధాన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా అందుబాటులోకి రానుంది. నగరంలో రాత్రి ఆర్థిక కార్యకలాపాలు, ఐటీ సంస్థలు, ఆసుపత్రులు, హోటళ్లు, లాజిస్టిక్స్, ఇతర షిఫ్ట్ ఆధారిత రంగాలు విస్తరిస్తున్న నేపథ్యంలో 24 గంటల ప్రజా రవాణా అవసరం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మక థర్డ్‌షిఫ్ట్ సేవలపై వచ్చే స్పందన కీలకంగా మారనుంది. ఆక్యుపెన్సీ ఆశించిన స్థాయిలో ఉంటే మరిన్ని కారిడార్లకు సేవలను విస్తరించే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

## 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు

చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

### 2027 పుష్కరాలకు భారీగా భక్తులు

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

### టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశించారు.

### రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

### మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు బీటీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం--పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

### అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు

జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దింపేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని, ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హత లేని వ్యక్తులను కలవాలనుకున్నారు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సీఎం చేసిన ఆరోపణలు అర్థరహితమని మండిపడ్డారు.

ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన కేంద్రం అనుమతి రాకముందే రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను హడావుడిగా ఖరారు చేసుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో అమెరికా, లండన్ సహా ఇతర దేశాలకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈసారి మాత్రం స్పష్టమైన పరిపాలనా కారణాలతో విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వలేదని చెప్పారు. విదేశీ పర్యటనల్లో ముఖ్యమంత్రి ఎవరిని కలుస్తారు? ఆ సమావేశాలతో దేశానికి ఏమైనా ప్రయోజనం ఉందా? అనే అంశాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుందని వివరించారు. అమెరికా పర్యటనలో రేవంత్‌రెడ్డి అర్హత లేని వ్యక్తులను కలవాలని నిర్ణయించుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించే, భారత్‌పై విమర్శలు చేసే వ్యక్తితో సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన వ్యక్తి న్యూయార్క్ మేయర్ మమ్దానీ కాదా? అని నిలదీశారు. న్యూయార్క్‌లో హిందువుల పండుగలపై ఆంక్షలు విధించిన వ్యక్తితో సీఎం భేటీ కావడం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన హోదాకు తగిన వ్యక్తులతోనే చర్చలు జరపాలని కిషన్‌రెడ్డి సూచించారు. సీఎం స్వయంగా విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పెట్టుబడుల కోసం అధికారుల బృందాన్ని పంపినా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. 2005లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్న విషయాన్ని కూడా కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి

### కార్యకర్తలే పార్టీకి బలం.. మీ ఫీడ్‌బ్యాక్‌కు విలువ

"ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మీ ముందు నిలబడ్డామంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలు, శ్రమే. ముఖ్యంగా 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కొని కూడా పసుపు జెండాను దించకుండా పోరాడిన మీరే పార్టీకి అసలైన బలం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా బీమా సౌకర్యం కల్పించి, ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేశామన్నారు. యువగళం పాదయాత్రలో కార్యకర్తలు కోరినట్లే, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు 'మైటీడీపీ' యాప్‌ను తీసుకొచ్చామని తెలిపారు. "మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమం, మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ నేరుగా మాకు చేరుతుంది. కొత్త పెన్షన్లు, ఇళ్ల మంజూరు వంటివి కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నాం. కష్టపడే కార్యకర్తను మేమే వెతుక్కుంటూ వస్తాం. ఎక్కడైనా సమస్య పరిష్కారం కాకపోతే, మీకు అండగా నేనుంటాను" అని హామీ ఇచ్చారు.

### అనంతపురం అభివృద్ధి నా బాధ్యత

ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ ఆదరించిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఎన్టీఆర్‌ను, హరిమామను, మా బాల మావయ్యను గెలిపించిన గడ్డ ఇది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను. అనంతపురం జిల్లా అభివృద్ధి నా బాధ్యత" అని స్పష్టం చేశారు. సోలార్, విండ్ ఎనర్జీ, ఫైటర్ జెట్ తయారీ సంస్థ వంటి పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ సంకల్పం పెట్టుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా, కనేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### గొడ్డలి పార్టీవి డ్రామాలే.. అసెంబ్లీకి రా జగన్!

వైసీపీపై లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గొడ్డలి పార్టీతో మనం రాజకీయంగా పోరాడుతున్నాం. సొంత బాబాయ్‌ని హత్య చేసి, ఆ నిందను ఇతరులపై వేయడం వారి నైజం. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో వారి మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే, దానికి కూడా మమ్మల్ని నిందిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు ఆయన సవాల్ విసిరారు. "డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్, డీఎస్సీపై చర్చకు సిద్ధమా? టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్. ప్రెస్‌మీట్లు కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రా. పులివెందుల ప్రజలు నిన్ను గెలిపించింది వారి సమస్యలు సభలో ప్రస్తావించడానికే. కానీ రెండేళ్లలో ఒక్కసారి ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లిపోయావు. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా" అని లోకేశ్ సవాలు చేశారు.

### కూటమి ఐక్యతను కాపాడాలి

కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. "జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. వాటిని నమ్మి ఆవేశపడొద్దు. మనమంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది" అని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని, ఇప్పటికే 16 వేల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ కేసులు

చాలా కేసులు తేలికపాటివి అని, వాటంతట అవే తగ్గిపోతాయని చెప్పారు. కాబట్టి ప్రజలు భయపడవద్దని ఆయన కోరారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న వైరస్ 2009 నుంచి ఉన్న మనకు తెలిసిన ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) పీడీఎమ్09 రకానికి చెందినదేనని ఆయన అన్నారు. అప్పటి నుండి ఈ వైరస్ ఒక స్థానిక, సీజనల్ ఫ్లూగా మారిందని చాలా ఇన్ఫెక్షన్లు తేలికపాటివి అని, వాటంతట అవే తగ్గిపోతున్నాయని ఆయన తెలిపారు. ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ల వల్లనే సాధారణంగా దగ్గు, జలుబు వంటివి వస్తాయని హెచ్1ఎన్1 అనేది ఇన్‌ఫ్లుయెంజా ఏ రకాలలో ఒకటని పేర్కొన్నారు. గతంలో హెచ్1ఎన్1ను సాధారణంగా స్వైన్ ఫ్లూ అని పిలిచేవారని కానీ ఇప్పుడు అది ప్రతి సంవత్సరం వ్యాపించే ఒక సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌గా మారిందని ఆయన చెప్పారు. ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లకు కాలక్రమేణా ఉత్పరివర్తనం చెందే లక్షణం ఉంటుందని ఆయన వివరించారు. అవి ప్రతి సంవత్సరం ఉత్పరివర్తనం చెందుతాయని.. ఈ విధంగానే వైరస్ మనుగడ సాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్నది కొత్త రకం వైరస్ కాదని చెప్పారు. ప్రస్తుతం దగ్గు, జలుబు లక్షణాలతో బాధపడుతున్న వారిలో అత్యంత సాధారణంగా గుర్తించబడుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్ హెచ్1ఎన్1 అని ఐసీఎంఆర్ నిఘా సూచిస్తుందని ఆయన తెలిపారు. చాలా వరకు దగ్గు, జలుబు కేసులు హెచ్1ఎన్1 కారణంగానే వస్తున్నాయని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అలాగే ఏ రకమైన దగ్గు లేదా జలుబు ఉందో తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు," అని డాక్టర్ బహ్ల్ తెలిపారు. ఏ వ్యాధి వ్యాప్తి అయినా ఒక గరిష్ట స్థాయికి చేరుకుని, ఆ తర్వాత తగ్గుముఖం పడుతుందని ఆయన అన్నారు. వ్యాప్తి ఎప్పుడు గరిష్ట స్థాయికి చేరుకుంటుందో లేదా ఎప్పుడు తగ్గుముఖం పడుతుందో ఖచ్చితంగా అంచనా వేయడం సాధ్యం కాదని కూడా స్పష్టం చేశారు. అయితే, రాబోయే కొన్ని వారాల్లో స్వైన్ ఫ్లూ కేసుల సంఖ్య తగ్గడం ప్రారంభమవుతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) ఎక్కువగా కనిపిస్తోంది, అలాగే హెచ్3ఎన్2, ఇన్‌ఫ్లుయెంజా బీ విక్టోరియా రకాలు కూడా గుర్తించబడుతున్నాయని రాజీవ్ బహల్ తెలిపారు. కొన్ని కోవిడ్-19 కేసులు కూడా ఉన్నాయి, కానీ ప్రస్తుతం అవి కూడా తగ్గుముఖం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిఘా సమాచారం ఆధారంగా హెచ్1ఎన్1 కేసుల మొత్తం సంఖ్యను అంచనా వేయడానికి ప్రయత్నించవద్దని ఆయన చెప్పారు. ఈ కేసులకు సంబంధించి ఆసుపత్రిలో చేరికల వివరాలను ఐసీఎంఆర్ నమోదు చేయదని ఆయన చెప్పారు. ఆ సమాచారాన్ని ఆరోగ్య శాఖ నుండి పొందాల్సి ఉంటుందని అన్నారు. ఫ్లూ, దగ్గు, జలుబు లేదా జ్వరం ఉన్నవారు తగినంత ద్రవపదార్థాలు తీసుకోవాలని, పౌష్టికాహారం తినాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని ఆయన సూచించారు. వారు ఇతరులతో సన్నిహితంగా ఉండటం మానుకోవాలని, దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును కప్పుకోవాలి, తరచుగా చేతులు కడుక్కోవాలని చెప్పారు. అదే సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి లేదా ఇతర తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వైద్య సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. అయితే వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు వంటి ఆరోగ్య సమస్యల ముప్పు ఎక్కువగా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని రాజీవ్ బహల్ సూచించారు.

## దీక్ష విరమించినా ఫీజు రీయింబర్స్మెంట్పై పోరాటం ఆగదు

విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

దీక్ష విరమించడానికి ముందు రాంచందర్ రావు 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

"తెలంగాణ విద్యార్థుల గొంతుక 58 ఏళ్ల యువ నేతగా చెప్పుకునే వ్యక్తికి కానీ, హైదరాబాద్‌లోని ఆయన గులాంకు కానీ వినిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు" అని ఆయన ఆరోపించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "యువతకు తామే సంరక్షకులమని చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓ బూటకం. తెలంగాణ యువత మేల్కొంది, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని రాంచందర్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రేపు ఇదే యువత ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని ఆయన అన్నారు.

# గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ముందడుగు

**- ప్రజలు భాగస్వామ్యం కావాలన్న పవన్ కళ్యాణ్**

**- తాటి వనం తీరానికి రక్షణ కవచం అన్నారు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచంగా గ్రేట్ గ్రీన్ వాల్ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. ప్రకృతి విపత్తుల సమయంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత గ్రామాలకు రక్షణగా నిలుస్తుందంటున్నారు. మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటు చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి విడతగా మడ అడవులకు, రెండో విడతగా తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీని కోసం దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ అంచనా వేసింది. ఈ ఏడాది తాటి కాయల సీజన్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను నాటే ప్రక్రియను పూర్తిచేశారు. ఈ సీజన్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.రాష్ట్ర అటవీ శాఖకు తాటి గింజల సేకరణ, నాటడం, తాటి మొక్కల పెంపకం వంటి అంశాల్లో ప్రజలంతా సహకరించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మొలకెత్తే తాటి మొక్కలు స్వీయ సంరక్షణ చర్యలు చేపట్టాలని.. మొలకెత్తిన మొక్కల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులు అటువైపు వెళ్లకుండా చూడాలన్నారు. విలువైన సహజ సంపదను కాపాడుకునే చర్యల్లో అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక ప్రజలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతాల వెంబడి అనుకూల ప్రదేశాల్లో శాస్త్రీయ పద్ధతిలో తాటి గింజల నాటాలన్నారు. గ్రేట్ గ్రీన్ వాల్‌తోపాటు 50 శాతం గ్రీన్ కవర్, పర్యావరణ పునరుద్ధరణ, రాష్ట్రంలో సహజ వనరుల పరిరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించే ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు.తాటి చెట్టు ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బురదతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థ్యం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం.

# శ్రీశైలంలో తీవ్ర విషాదం

**- వడ్డెర సత్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య**

**శ్రీశైలం** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని వడ్డెర సత్రంలో శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురు వ్యక్తులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.గత నెల 28న శ్రీశైలం చేరుకున్న ఈ కుటుంబం సత్రంలోని గదిలో బస చేస్తోంది.వీరిలో ఇద్దరు పురుషులు గదిలోని హాలులో ఫ్యాన్కు ఉరేసుకోగా ముగ్గురు మహిళలు స్నానాల గదిలో (బాత్రూమ్లో)ఆత్మహత్య చేసుకున్నారు. దాదాపు రెండు రోజుల క్రితమే జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.సత్రం గదినుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో నిర్వాహకులు స్థానికులు పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఎస్పీ రామాంజనేయులు పరిస్థితిని సమీక్షించారు.మృతులను పల్లపు సుధాకర్ (36)ఆదిలక్ష్మి (50)మల్లేశ్వరి (45)శ్రీదేవి (33)మణికంఠ(15)గా గుర్తించారు.వీరంతా దాదాపు నెల రోజుల నుంచి ఇక్కడే బస చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ దారుణానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నందిగామలో ఆటోను ఢీకొన్న బైక్..

**- ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు**

**ఎన్టీఆర్ జిల్లా, నందిగామ:** నందిగామ పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను బైక్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. నందిగామ నుంచి చందర్లపాడు వైపు ఉపాధ్యాయులు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులను పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# భారీ ఆయుధాలు స్వాధీనం

**రాయ్‌పూర్** ఛత్తీస్గఢ్లో భద్రతా బలగాలు సోమవారం రాత్రి భారీగా నక్సల్స్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. భేజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భండార్పదర్, మునుర్గొండ అటవీ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఎస్ఎల్ఆర్ రైఫిల్, 315 బోర్ తుపాకీ, మస్కెట్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, గ్రెనేడ్లు, ఇతర సామగ్రిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఆయుధాల స్వాధీనం నేపథ్యంలో అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మరింత విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

# వంశధార కాల్వలో కారు బోల్తా..

**శ్రీకాకుళం** శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కిన్నెరవాడ సమీపంలో విషాదం జరిగింది. వంశధార ఏడో కాల్వలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారు కాల్వలో పూర్తిగా మునిగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు మృతి చెందారు.

మృతులు సీపాన రాము (50), మెండ విశాల్ కుమార్ (26). వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ గొటివాడ నాగరాజు సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు డ్రైవర్ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

### వరుసకు కొడుకు అయిన యువకుడితో

# వివాహేతర సంబంధం

**- భర్తను హతమార్చిన భార్య**

**యాదాద్రి భువనగిరి** చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో రాపోలు దానయ్య (36), శారద అనే దంపతులు 15 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. భార్య శారద తన సోదరుడి కొడుకు శివ(19)తో శారద వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసి దానయ్య వారిని మందలించాడు. ఈ నెల 23వ తేదీన భర్తతో పొలానికి వెళ్లి, మలవిసర్జనకు వెళ్తానని చెప్పి, అప్పటికే అక్కడ పొదల్లో ఉన్న శివ వద్దకు శారద వెళ్లింది. శారద ఎంతకూ తిరిగి రాకపోవడంతో చెట్ల పొదల్లో వెతకగా.. శివ, శారద సన్నిహితంగా ఉండడం చూసి కోపంతో పక్కనే ఉన్న కర్రతో వాళ్లను కొట్టేందుకు దానయ్య ప్రయత్నించాడు. దీంతో ఆ కర్రను శివ లాక్కుని దానయ్య తలపై బలంగా కొట్టాడు. పారిపోతున్న దానయ్యను శివ రాయితో కొట్టడంతో అతను కిందపడిపోగా, శారద అతని కాళ్లను గట్టిగా పట్టుకుంది. వెంటనే పెద్ద బండరాయితో తలపై శివ గట్టిగా కొట్టడంతో దానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తరువాత మీా అన్న కనిపించడం లేదని దానయ్య తమ్ముడు శ్రీనుకు శారద ఫోన్ చేసి చెప్పింది. అక్కడికి వచ్చిన శ్రీను విగతజీవిగా ఉన్న దానయ్యను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనుమానంతో శారదను అదుపులోకి తీసుకుని విచారించగా, శివతో కలిసి తానే హత్య చేసినట్లు నిందితురాలు అంగీకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసారు.

# సీఎం విదేశీ పర్యటనకు అనుమతి రద్దు

**హైదరాబాద్** విదేశీ పర్యటనకు 15 రోజుల ముందు అప్లై చేయాల్సింది కేవలం 5 రోజుల ముందు ఎందుకు అప్లై చేశారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో చేయకూడని కార్యక్రమాలు చేస్తున్నాడనే సమాచారంతోనే రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు చేశామని కేంద్ర ప్రభుత్వం చెప్తుంది. అలాంటి చేయకూడని కార్యక్రమాలు ఏం చేస్తున్నారో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అయన అన్నారు.చేయకూడని పనులు చేస్తున్నాడని బీజేపీ చెప్తుంది, రాజకీయ కుట్ర అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. రెండు పార్టీలు కూడా రేవంత్ రెడ్డి పొలిటికల్ క్లియరెన్స్ కోసం చేసిన దరఖాస్తులను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.

# మరో ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

**- బ్రేక్ ఫాస్ట్‌తిని అస్వస్థతకు గురైన 13 మంది విద్యార్థులు**

**ఖమ్మం** వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. 13మంది విద్యార్థులు అల్పాహారం తిన్న కొద్దిసేపటికి కడుపు నొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను చికిత్స నిమిత్తం సిబ్బంది ఆసుపత్రికి తరలించారు

# సెట్టురు ఎస్సి బాలుర వసతి గృహ వార్డెన్ సస్పెన్షన్

శెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థి హర్షవర్ధన్‌తేజ మృతి చెందగా అందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ ధనుంజయను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు సోషియల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు. కలెక్టర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వసతి గృహాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. ప్రమాదానికి కారణమై ప్రదేశాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు ఎందుకు ఇంకా ఉపయోగించడం లేదని ఆరా తీశారు. సదరు విద్యార్థులు ఎందుకు బహిర్భూమికి బయటకు వెళ్లారని అడిగి తెలుసుకున్నారు. కళ్యాణదుర్గం ఎస్సీ వసతి గృహ వార్డు సూరాంజనేయులును ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారని తెలియజేశారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్ల చిన్నపాటి పనులు పూర్తి చేయించి, ప్రహరీ గోడను నిర్మింపజేసేలా చూస్తామని చెప్పారు. వార్డెన్, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గంటల్లోనే ఇద్దరు చిన్నారుల కిడ్నాప్ కేసు ఛేదింపు

**హైదరాబాద్** గచ్చిబౌలిలో ఇద్దరు చిన్నారుల కిడ్నప్ కేసు చేధించాం. వెస్ట్ బెంగాల్ చెందిన కిడ్నాపర్ చాకు సోరెన్ అరెస్ట్ చేసామని శెలిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.కేసు వివరాలు అయన మీడియాకు వెల్లడించారు. గచ్చిబౌలిలోని సుదర్శన్ నగర్ వద్ద ఓ కన్స్ట్రక్షన్ లేబర్ క్యాంప్ లో నిన్న సాయంత్రం 4 గంటలకు చిన్నారులకు చాక్లెట్స్ ఇప్పిస్తానని తీసుకెళ్లి కిడ్నాప్ చేసాడు. నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలింపు చేపట్టాము. కిడ్నాప్ గురైన బాలికలు ఇద్దరు 4 ఏళ్ల లోపు వయస్సు వుంది. నిన్న రాత్రి నుండి అన్ని చెక్ పోస్ట్ రైల్వే స్టేషన్ అలెర్ట్ చేసాం. ఘాట్ కేసర్ పెట్రో కారు సమాచారం ఇచ్చాం. ఘట్కేసర్ రైల్వే స్టేషన్లో చిన్నారులతో కలిసి వెళుతుండగా కిడ్నాపర్ ను పట్టుకున్నామని అన్నారు.నిన్న మిడ్ నైట్ మాకు ఫిర్యాదు అందగానే 4 పోలీస్ టీమ్స్ ఫామ్ చేశాము. గంటల వ్యవధిలోనే కిడ్నప్ కేసు ను చెందించం. ఇద్దరు చిన్నారులు సురక్షితం ఉన్నారు. కిడ్నాపర్ చాకు సోరెన్ ఇతనికి నేర చరిత్ర ఉంది. గతంలో అటెంప్ట్ మర్డర్ కేసుతోపాటు రేప్ కేసులో ఇతను అరెస్ట్ అయ్యాడు. ఇతను పై వెస్ట్ బెంగాల్లో రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయి . లేబర్ క్యాంప్ లో పనిచేసే వ్యక్తే చిన్నారుల కిడ్నప్ చేసినట్లు నిర్ధారణ అయింది. నిన్న సాయంత్రం ఇద్దరూ బాలికలను చాక్లెట్ ఇప్పిస్తానని కిడ్నాప్ చేశాడు. కిడ్నాప్ చేసిన వ్యక్తి ఈ క్యాంపులోనే సెంట్రింగ్ పని చేస్తాడు. చిన్నారుల తల్లిదండ్రులు బిజీగా ఉన్న సమయంలో కిడ్నాప్ చేశాడు. విచారణలో, పశ్చిమ బెంగాల్లోని కరండిఘి పోలీస్ స్టేషన్లో నమోదైన రెండు క్రిమినల్ కేసులలో ఇతని ప్రమేయం ఉంది. ఒకటి హత్యాయత్నానికి సంబంధించినది కాగా, మరొకటి అత్యాచారానికి సంబంధించినది. పశ్చిమ బెంగాల్లోని ఇస్లాంపూర్ జైలులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాడు. డబ్బు సంపాదించడం కోసం చిన్నారులను కిడ్నాప్ చేసాడు. పిల్లలు అవసరం ఉన్నవారికి అమ్మడంలో ఇతని ప్రమేయం ఉంది. చిన్నారులను భిక్షాటన కోసం ఉపయోగించుకోవాలని నిందితుడు కిడ్నాప్ చేసాడు. ఇతర క్రిమినల్ కార్యకలాపాల గురించి క్షుణ్ణంగా విచారిస్తున్నారు. గతంలో ఏవైనా క్రిమినల్ కేసులలో అతని ప్రమేయం నిర్ధారించుకోవడానికి అతని పూర్వ చరిత్రను విచారణ జరుపుతున్నామని అన్నారు.

# సెట్టురు విద్యార్థి మృతిపై బోర్డు చైర్మన్ ఆగ్రహం

శెట్టూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్‌తేజ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరితో చరవాణిలో ఆయన మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నా బహిర్భూమికి బయటకు ఎందుకు వెళ్తున్నారు. పర్యవేక్షకులు అందుబాటులో ఉంటున్నారా, వారు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సదరు వార్డెన్‌ను సస్పెండ్ చేశామని డీడీ వివరించగా, మరణిస్తే తిరిగి రన్నారు. విద్యార్థుల పర్యవేక్షణపై నిర్లక్ష్యం చూపరాదని, జిల్లాలో ఉన్న అన్ని వసతి గృహాలు తనిఖీలు చేపట్టి అక్కడి పరిస్థితి తెలుసుకోవాలన్నారు. ఇబ్బందులు, అధికారుల తీరు పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు

**హనుమకొండ** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుత్ను నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు, విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి. ముదిగొండ నాగేశ్వర్ రావు, (55) తనకు వున్న నెట్‌వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్ మరియు సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు, రాందాస్ శేషరావు బీరదార్ , అక్లీం, షారుఖ్ ఖాన్, షేక్ అక్బర్, నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోబడింది. దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగింది.గంజాయి స్మగ్లర్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు, శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ ఇన్స్‌స్పెక్టర్ సంతోష్, దామెర ఎస్.వ వీరభద్రరావు, శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్, పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా, దామెర, శాయంపేట కానిస్టేబుళ్ళను సీపీ ఎన్ శ్వేతఅభినందించారు.

# మొయినాబాద్‌లో రహస్యభేటీ

**హైదరాబాద్ :** లండన్ పర్యటన ముగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారు.శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. సాయంత్రం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ సమావేశంలో రేవంత్ ఏం మాట్లాడబోతున్నారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సురేఖ వ్యవహారం, అమెరికా వెళ్లడానికి కేంద్ర విదేశాంగ శాఖ మోకాలడ్డటం వంటి పరిణామాలపై రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడతారనేది ఆసక్తికరంగా మారింది. రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశానికంటే ముందే తెలంగాణ రాజకీయాలలో సంచలన పరిణామాలు చోటు చేసుకుంటున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.గులాబీ పార్టీకి అనుకూలంగా ఉండే కొన్ని సోషల్ మీడియా గ్రూపులు.. ముఖ్యంగా ఎక్స్ హ్యాండిల్స్ లో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అందులో ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 20 మంది ఎమ్మెల్యేలతో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలు జరుగుతున్నాయి.. ఇవి చర్చనీయాంశంగా మారిపోయారు.. మొయినాబాద్‌లోని ఒక వ్యవసాయ క్షేత్రంలో రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో సుమారు 20 మంది ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశం అయ్యారని ప్రచారంలో ఉంది.ఈ సమావేశంలో ఆ 20 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహార శైలి మీద.. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు సాగిస్తున్న ఆధిపత్యం మీద తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడినప్పటికీ.. తమ ధోరణి మార్చుకునే అవకాశం లేదని వారు చెప్పినట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతోంది.మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశానికి కొంతమంది సీనియర్ మంత్రులు సపోర్ట్ చేసినట్టు తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రి.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చెందిన ఒక మంత్రి.. రంగారెడ్డి.. నల్గొండ జిల్లాలకు చెందిన కొంతమంది సీనియర్ ఎమ్మెల్యేలు.. ఉమ్మడి పాలమూరు జిల్లా చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇందులో పాల్గొన్నట్టు గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం జరుగుతుంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఒకవేళ ఆ 20 మంది ఎమ్మెల్యేలు తాటి మీదికి వస్తే.. రాజకీయంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని.. కెసిఆర్ ను మరోసారి ముఖ్యమంత్రి చేస్తారని గులాబీ పార్టీ సోషల్ మీడియా గ్రూపులో సొంత డబ్బా కొట్టుకుంటున్నాయిఇక ఇటీవల రేవంత్ రెడ్డి ఫారిన్ టూర్ కు సంబంధించిన వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఆయన అమెరికా టూర్ రద్దయింది. గడ్డం నుంచి నేరుగా ఆయన హైదరాబాద్ వచ్చారు. దీనిపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

సరే గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వకపోవడంతో ఆయన టూర్లో ఆకస్మికంగా మార్పులు జరిగాయి. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత పరిణామాలు కూడా దీనికి కారణమని గులాబీ పార్టీ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.కొంతకాలంగా క్యాబినెట్ విస్తరణ కూడా వాయిదా పడుతూ వస్తోంది. మినిస్టర్ పదవులు ఆశిస్తున్న కొంతమంది సీనియర్ లీడర్లు తీవ్రమైన అసంతృప్తిలో ఉన్నారు. మొయినాబాద్ వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న సమావేశం లో నిజం ఎంత.. దీని వెనక గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎందుకు ఈ స్థాయిలో ప్రచారం చేస్తోంది.. రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారా.. అనే విషయాలపై క్లారిటీ రావాలంటే కాస్త సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

# మాయ ప్రేమ గుణపాఠం...

**మెదక్ :** వయసు వేడిలో చాలామంది యువత తప్పుదారులు పడుతున్నారు. దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఘోరమైన పనులకు పాల్పడుతున్నారు. చివరికి వారిలో పశ్చాత్తాపం కలిగినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఈమె జీవితం కూడా అలాంటిదే. చేసిన తప్పు మాములుది కాదు. సభ్య సమాజం ఈమె చేసిన దారుణాన్ని చూసి తలదించుకుంది. చివరికి ఏమైందో తెలియదు.. ఆమెలో ఎటువంటి బాధ ఆవహించిందో అర్థం కాలేదు. కానీ కఠినమైన నిర్ణయం తీసుకుంది.సంగారెడ్డిలో నర్సిగా పనిచేస్తూ ఉండేది సురేఖ అనే యువతి. ఈమెకు 25 సంవత్సరాలు. కుటుంబం పరంగా ఆర్థిక సమస్యలు లేవు. ఈమెకు ఒక సోదరుడు ఉన్నారు. ఈ క్రమంలో సురేఖ ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగించడం మొదలుపెట్టింది. అతడితోనే వివాహం జరిపించాలని కోరింది. దానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్దిరోజులు వారితో సురేఖ మాట్లాడలేదు. ఆ తర్వాత తన ప్రియుడి గురించి వారితో చర్చించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ అతడితో పెళ్లికి వారు ఒప్పుకోలేదు. దీంతో సురేఖ వారి మీద ఆగ్రహం పెంచుకుంది. ప్రతిసారి తనను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో వారిని అంతం చేయాలని భావించింది.సరిగా ఏడు నెలల క్రితం ఇంటికి వెళ్లిన సురేఖ.. తల్లిదండ్రులకు మత్తుమందు ఇచ్చింది. ఆ మత్తులోనే వారిద్దరు చనిపోయారు. ఆ తర్వాత వారిద్దరికీ గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసింది. మహానటి లెవెల్లో ఫెర్ఫార్మన్స్ ఇచ్చింది. కానీ.. ఆమె మాట్లాడిన మాటలకు.. చెప్పిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ప్రేమికుడితో పెళ్లి జరిపించలేదని ఆగ్రహంతోనే ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేశారు. గడిచిన ఏడు నెలలుగా ఆమె జైలు శిక్ష అనుభవించింది. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలో ఆమె ఒక హాస్టల్లో ఉంటోంది. తన పేరెంట్స్ ను ఏ విధంగానైతే మత్తుమందు ఇచ్చి అంతం చేసిందో.. అదే తీరుగా ఆమె కూడా మత్తుమందు తనకు తాను ఇచ్చుకుని.. బలవన్మరణానికి పాల్పడింది. సురేఖ వ్యవహారం ఎంతోమందికి గుణపాఠం లాగా మారింది.వయసు వేడిలో కన్న తల్లిదండ్రులనే ఆమె మర్చిపోయింది. మాయదారి ప్రేమ కోసం ఏకంగా వారినే అంతం చేసింది. చివరికి తన ప్రాణాలు తాను తీసుకుంది. ఆమె తీసుకున్న నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం తీరని దుఃఖంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు చనిపోయి.. సోదరి కూడా ఇలా కనుమూయడంతో సురేఖ సోదరుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఇంతటి ఘోరం ఏ కుటుంబానికి రాకూడదని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# కేంద్ర ప్రభుత్వ రహ్-వీర్ పథకం..

**- ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల నగదు బహుమతి**

**- డీటీఓ శంకర్ నాయక్**



**మహబూబాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహ్-వీర్ పథకం గురించి జిల్లా ప్రజలు తెలుసుకోవాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమని, ఈ సమయంలో గాయాలపాలైన వారిని వెంటనే ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని రహ్-వీర్‌గా గుర్తిస్తారని తెలిపారు. అర్హత పొందిన రహ్-వీర్‌కు రూ. 25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారని పేర్కొన్నారు.

### పౌరులు ఏం చేయాలి?

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఉన్నా, ప్రమాదాన్ని చూసినా పౌరులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించాలని శంకర్ నాయక్ సూచించారు. బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం తమ వివరాలను ఆస్పత్రిలో ఇవ్వాలని తెలిపారు. అక్కడి నుంచి సంబంధిత ఏరియా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, సహాయం చేసిన వ్యక్తి వివరాలతో పాటు ఏ ఆస్పత్రిలో బాధితుడిని చేర్పించారనే సమాచారాన్ని తెలియజేస్తారని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే జిల్లా స్థాయి కమిటీ ద్వారా వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న రహ్-వీర్‌కు రూ. 25,000 నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

### రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?

మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 134(ఎ) ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని 'రహ్-వీర్' గా పరిగణిస్తారని తెలిపారు.రహ్-వీర్ పథకం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడం, ప్రమాద సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు సామాన్య ప్రజలను ప్రోత్సహించడం అని శంకర్ నాయక్ వివరించారు.అలాగే బాధితులకు సహాయం చేసే పౌరులకు ఎలాంటి పోలీస్ లేదా చట్టపరమైన ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించడం కూడా ఈ పథకంలోని ముఖ్య ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.సంవత్సరానికి ఐదు సార్లు అవకాశం సంవత్సరానికి ఒక వ్యక్తికి (5) సార్లు మాత్రమే రహ్-వీర్ నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇస్తారు అని శంకర్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు.ఒక వ్యక్తి సమయానికి స్పందించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడటమే కాకుండా, ఒక కుటుంబాన్ని విషాదం నుంచి రక్షించినవారవుతారని ఆయన అన్నారు. రహ్-వీర్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీటీఓ శంకర్ నాయక్ పేర్కొన్నారు.

# శ్రీశైల దేవస్థానంలో ధర్మకర్తల మండలి సమావేశం

**- 10వ ధర్మకర్తల మండలి సమావేశంలో పలు నిర్ణయాలు**

**- క్యూకాంప్లెక్సు నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు**

**- ఏప్రియల్ మాసం నుంచి జూలై మాసం వరకు జమాఖర్చుల పరిశీలన**

**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి 10వ సమావేశం నిర్వహించబడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనాటి సమావేశంలో మొత్తం 18 అంశాలు చర్చించబడ్డాయి. వీటిలో 15 అంశాలు ఆమోదించబడ్డాయి. మిగతా 3 అంశాలను వాయిదా వేయడం జరిగింది. సమావేశ ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మౌలికసదుపాయాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించడం జరుగుతోందన్నారు. క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనను చేపట్టడం జరుగుతుందన్నారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తుల సౌకర్యార్థం ప్రతీ శని,ఆది,సోమవారాలలో ఉదయం మరియు మధ్యాహ్నవేళలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కేవలం రాత్రి వేళలో మాత్రమే శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మొత్తం ఒకేసారి 12వేల మంది భక్తులు వేచివుండేవిధంగా 3 అంతస్తులుగా ఈ క్యూకాంప్లెక్సును నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ శ్రీశైల దక్షిణద్వారమైన జ్యోతిస్సిద్ధవట ఆలయాలను దశలవారిగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవట ఆలయంలో



నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

### సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు

సెప్టెంబరు 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న గణపతి నవరాత్రోత్సవాలలో సాక్షిగణపతి ఆలయం వద్ద తగు విద్యుద్దీపాలంకరణ చేయాలని నిర్ణయించడం జరిగింది. 2026 -27 సంవత్సరానికి సంబంధించి ఏప్రియల్ మాసం నుంచి జూలై మాసం వరకు గల దేవస్థాన జమాఖర్చులు పరిశీలించబడ్డాయి. దేవస్థానంలో స్వచ్ఛందసేవను నిర్వహిస్తున్న శివసేవకుల వసతి కోసం వినియోగిస్తున్న నందికేశ సదనం నందు మరిన్ని పరుపులు, దిండ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. వీటి అంచనా వ్యయం సుమారు రూ.19 లక్షలు. గణేశసదనం, ఔటర్‌రింగ్‌రోడ్డు సెంట్రల్ పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాటు చేయబడిన టాయిలెట్స్ బ్లాక్ ముందు, సమీప ఖాళీస్థలంలో సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగు వేయాలని నిర్ణయించడం జరిగింది. దీని అంచనా వ్యయం రూ. 9.20 లక్షలు పాతాళగంగమార్గంలోని పబ్లిక్ టాయిలెట్స్ కు పూర్తిస్థాయి మరమ్మతులు, డ్రైనేజీ మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులు చేయాలని తీర్మానించడం జరిగింది. దీని అంచనా వ్యయం రూ. 32 లక్షలు భక్తులు శ్రీస్వామిఅమ్మవార్లకు సమర్పించే వస్త్రాలను స్వీకరించే వీలుగా అమ్మవారి ఆలయంలోని అనువైన ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన వస్త్రముల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది.

# ఇల్లు లేని పేదలకు స్థలాలు ఇవ్వాలి

## ములుగు జిల్లాలో డిమాండ్

**- 116 సర్వే ప్రభుత్వ భూమి ఆక్రమణ**

**- లక్షలకు అమ్మకాలు జరుగుతున్నాయి**

**- అధికారుల నిర్లక్ష్యంపై ఏజెన్సీ దళిత సంఘం ఆగ్రహం**



**మంగపేట(ప్రశ్నన్యూస్)** ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలి చేసుకుంటేనే బతికే కుటుంబాలు సొంత ఇల్లు కట్టుకునేందుకు స్థలం లేక బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నాయి. గ్రామంలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ పేదలకు కేటాయించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యపై ఏజెన్సీ దళితుల సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరికి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ నేతలు మంగళవారం మండల తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కమలాపూర్ గ్రామంలోని 116 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ అసైన్మెంట్ భూమి, మిగులు భూమిని గుర్తించి పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని వారు కోరారు. 116 సర్వేలోని ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దానిని లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని పరికి శ్రీనివాస్ ఆరోపించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. వెంటనే ఆ భూమిని సర్వే చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద వర్గాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు కేటాయించేందుకు చట్టాలు చేశాయని ఆయన గుర్తు చేశారు. ఆ చట్టాల ప్రకారం ఇంటి స్థలం లేని పేదలకు ప్రభుత్వ అసైన్మెంట్ భూములపై పూర్తి హక్కు ఉందన్నారు. కమలాపూర్‌లోని 116 సర్వే భూమిని స్థానిక ఎమ్మార్వో గుర్తించి తక్షణమే పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం నిరుపేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ దళితుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఉన్నతాధికారులను కోరుతున్నది. ఇంటి స్థలాలు లేని ప్రతి కుటుంబానికి స్థలం ఇచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని పరికి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు గాజర్ల రాజు, మాదిగ జెట్టి రవిందర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. వినతి స్వీకరించిన తాసిల్దార్ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.

# పచ్చదనంతో శ్రీశైల క్షేత్రానికి కొత్త శోభ

**- వర్షాకాలంలో 5 వేల మొక్కలు నాటాలని దేవస్థానం నిర్ణయం**

**- వలయ రహదారికి ఇరువైపులా విస్తృతంగా వృక్షారోపణ**

**- దేవతా వృక్షాలతో ఆధ్యాత్మిక వాతావరణం పెంచేందుకు చర్యలు**



**శ్రీశైలం(ప్రశ్న న్యూస్)** ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీశైలాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు దేవస్థానం చర్యలు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వర్షాకాలం ముగిసేలోగా క్షేత్ర పరిధిలో 5 వేల మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈఓ ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు మొక్కలు నాటారు.

### వలయ రహదారి వెంబడి పచ్చదనం

ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. క్షేత్ర పరిధిలో ఆరుబయలు ప్రాంతాలు, దేవస్థానం ఉద్యానవనాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి సంరక్షిస్తామన్నారు. వలయ రహదారికి ఇరువైపులా మరిన్ని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం ఉద్యానవనాల్లో సుందరీకరణకు అనువైన మొక్కలను నాటడంతోపాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఆరుబయలు ప్రాంతాల్లో భక్తులకు నీడనిచ్చే చెట్లను పెంచుతామన్నారు.

### దేవతా వృక్షాలకు ప్రాధాన్యం

క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించేందుకు అనువైన ప్రాంతాల్లో దేవతా వృక్షాలను నాటాలని ధర్మకర్తల మండలి సభ్యులు సూచించారు. పచ్చదనం పెంపుతో క్షేత్ర సౌందర్యం ఇనుమడించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

### సంప్రదాయబద్ధంగా వృక్షారోపణ

మొక్కలు నాటే కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా సాగాలని సంకల్పపూర్వకంగా గణపతి పూజ నిర్వహించి, అనంతరం వృక్షపూజ చేశారు. ఆపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కదంబం, చింత, మర్రి, వేప, తెల్లమద్ది, బాహునియ, స్పాతోడియా తదితర రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి.రమణ, బొనేని రవణమ్మ, చిట్టిబొట్ల భరద్వాజశర్మ, జి.లక్ష్మేశ్వరి, జవ్వాజి రేఖాగౌడ్, శంకరశెట్టి పిచ్చయ్య, కాశీనాథ్ చిలువేరు, ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, పి.యూ.శివమ్మ, జిల్లెల శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, కట్టా సుధాకర్, ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి లోకేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాయదుర్గం గాలికి..

# రూ.10 వేల కోట్ల పెట్టుబడి

**- 1,325 మెగావాట్ల సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన**

**- 144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్ల ప్రారంభం.. 4 వేల మందికి ఉపాధి**

**- 2030 నాటికి 5 వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక విద్యుత్ లక్ష్యం**




**రాయదుర్గం(ప్రశ్న న్యూస్ )** అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో పునరుత్పాదక ఇంధన రంగానికి భారీ ఊతం లభించింది. కణేకల్లు మండలం హులికెర గ్రామం వద్ద సుజ్లాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.10 వేల కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా సుజ్లాన్ సంస్థకు చెందిన 144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రదర్శించిన ఆడియో విజువల్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు.

### గ్రీన్ ఎనర్జీకి పెద్దపీట

పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు భారీ అవకాశాలు ఉన్న నేపథ్యంలో సుజ్లాన్ విస్తరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో సుజ్లాన్ అతిపెద్ద పవన విద్యుత్ భాగస్వామిగా కొనసాగుతోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది.

### బ్లేడ్ ఉత్పత్తికి కొత్త లైన్లు

హులికెరలో పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతోపాటు సుజ్లాన్ 144 కొత్త బ్లేడ్ ఉత్పత్తి లైన్లను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతతో తయారయ్యే విండ్ టర్బైన్ బ్లేడ్ల ఉత్పత్తికి ఈ లైన్లు ఉపయోగపడనున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అంతకుముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలోని సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించారు. సంస్థ ప్రతినిధులను ప్రాజెక్టుల పురోగతి, ఉత్పత్తి సామర్థ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విండ్ టర్బైన్‌పై సంతకం చేశారు.

### ఉమ్మడి కృషితో ప్రాజెక్టులు

పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. స్థానికంగా అనుబంధ పరిశ్రమలు, సేవారంగ కార్యకలాపాలకు కూడా ఊతం లభించనుంది. కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో-ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు

**- వెంకయ్యనాయుడు జీవితం విద్యార్థులకు స్ఫూర్తి: ఎంపీ వేమిరెడ్డి**

**- వింజమూరు వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ**

**- కళాశాల అభివృద్ధి, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు రూ.10 లక్షల విరాళం**



**వింజమూరు(ప్రశ్న న్యూస్)** పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగితే ఎవరైనా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి దేశ ఉపరాష్ట్రపతిగా, పద్మవిభూషణ్ గ్రహీతగా ఎదిగిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారుమంగళవారం ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల్లో వేమిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడు రాజకీయ ప్రస్థానం ఉదయగిరి ప్రాంతం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. సాధారణ గ్రామీణ కుటుంబంలో జన్మించిన ఆయన దేశ అత్యున్నత పదవుల్లో ఒకటైన ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం వెనుక క్రమశిక్షణ, నిబద్ధత, సంకల్పం కీలకపాత్ర పోషించాయని చెప్పారువిద్యార్థులు వెంకయ్యనాయుడి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు కూడా పిల్లల్లో మంచి విలువలు, లక్ష్యసాధన పట్ల పట్టుదలను పెంపొందించాలని కోరారు.

### చదువుకున్న చోటుకు సేవ చేయాలి

విద్యతోపాటు క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే విజయాన్ని సాధించడం సులభమవుతుందని వేమిరెడ్డి అన్నారు. తాము చదువుకున్న విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలన్నారు. వెంకయ్యనాయుడు కుటుంబం విద్యా, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఇటీవల వెంకయ్యనాయుడు కుమారుడు హర్షవర్ధన్‌బాబు ముప్పవరపు ఫౌండేషన్ తరఫున బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్‌ఎన్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలకు 100 బెంచీలు అందజేసిన విషయాన్ని ఎంపీ ప్రస్తావించారు. తాను చదువుకున్న పాఠశాలలోని పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సహాయం అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి పూర్వ విద్యార్థి తాను చదువుకున్న విద్యాసంస్థను గుర్తుంచుకుని అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

### వైఆర్ కళాశాలకు రూ.10 లక్షలు

వింజమూరు వైఆర్ జూనియర్ కళాశాల ఐదు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించి ఉన్నత స్థానాలకు చేర్చిందని వేమిరెడ్డి తెలిపారు. కళాశాల అభివృద్ధితోపాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపయోగపడేలా రూ.10 లక్షలు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. నిధులను విద్యార్థుల ప్రయోజనాలకు, కళాశాల అభివృద్ధికి సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో కళాశాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని యాజమాన్యానికి సూచించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంచిర్యాలలో సోమవారం నుంచి

# అల్పాహారం పథకం ప్రారంభం

**- జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం షురూ**



**మంచిర్యాల ( ప్రశ్న న్యూస్ )** మంచిర్యాల జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 31 నుంచి దాదాపుగా 40,000 మంది ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. హరేకృష్ణ ఫౌండేషన్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ రంగ అగ్రగామి సంస్థ సింగరేణి సమకూర్చిన సీఎస్ఆర్ నిధులతో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆటోమేటెడ్ సెంట్రలైజ్డ్ కిచెన్ సిద్ధం చేశారు. ఈ కిచెన్ గంటకు 8,000 ఇడ్లీలు, 3,000 దోశలు, 5,000 పూరీలు తయారు చేయగలదు. వ్యర్థ నీటి శుద్ధి ప్లాంట్, బయోగ్యాస్ తయారీ వ్యవస్థ వంటి ఆధునిక సదుపాయాలు కూడా ఉన్నాయి.

# అమ్మవారి సన్నిధిలో నూతన లోకాయుక్త

**- కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి.. - కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు**



**విజయవాడ(ప్రశ్న న్యూస్ )** ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్త, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తాళ్లప్రగడ మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. లోకాయుక్తగా ప్రమాణ స్వీకారం అనంతరం అమ్మవారి దర్శనానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు, కుటుంబ సభ్యులకు దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ డిప్యూటీ ఈవో కిషోర్‌కుమార్ స్వయంగా హాజరై కుటుంబ సభ్యుల అంతరాలయ దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మను దర్శించుకున్న నూతన లోకాయుక్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. డిప్యూటీ ఈవో కిషోర్‌కుమార్ అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాంగ్ రూట్‌లో స్కూల్ బస్

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన వైనం : ఒకరికి గాయాలు




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లోటస్ ఎంక్లేవ్ ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన జివికె ఇంటర్నేషనల్ స్కూల్ బస్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్ రాంగ్ రూట్‌లో ప్రయాణించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులో విద్యార్థులు ప్రయాణిస్తున్న సమయంలో ఇలాంటి నిర్లక్ష్యం జరిగితే వారి భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రమాద దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఘటనపై పోలీసులు, ఆర్టీఏ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనలు ప్రైవేటు పాఠశాలలకు వర్తించవా

ట్రాఫిక్ నిబంధనలు ప్రైవేటు పాఠశాలకు వర్తించవవా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు రాంగ్ రూట్లలో వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి అయినా ప్రైవేటు పాఠశాలల బస్సుల డ్రైవర్లు కానీ పాఠశాల యాజమాన్యం గాని మారకపోవడం సూచనీయ మని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నా రులను తీసుకెళ్లే ప్రైవేట్ పాఠశాలల బస్సులు జాగ్రత్తగా వెళ్లాల్సి ఉండగా నిర్లక్ష్యంగా రాంగ్ రూట్లో వెళుతూ ప్రమాదాల బారిన పడుతు న్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలనే అత్వెల్లి లోని సెయింట్ క్లరేట్ పాఠశాలకు చెందిన బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇప్పుడు జీవీకే బస్సు రాంగ్ రూట్లో వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్ట డంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. అనుకోకుండా పెద్ద ప్రమా దం జరిగితే బాధ్యులు ఎవరు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ట్రాఫిక్ రూల్స్ పాటించండి

ప్రవేట్ పాఠశాలల స్కూల్ బస్సు ల డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని స్థానికులు కోరుతున్నారు. రాంగ్ రూట్లో బస్సులను నడపద్దని, మద్యం సేవించి బస్సులను నడపవద్దని, అనుభవం ఉన్న వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నారు.



## ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించిన
# గజ్వేల్ సూర్య నమస్కారాల బృందం




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సూర్య నమస్కారాల బృందం కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించింది. ఆధ్యాత్మికతతో పాటు చారిత్రక, పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో బృంద సభ్యులు ఈ పర్యటన చేపట్టారు. పర్యటనలో భాగంగా తొలుత కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం కన్యాకుమారి, శ్రీరంగం, త్రివేంద్రంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం, ఆజ్మాల దేవాలయం, శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం, మధురై తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ ప్రతిరోజూ సూర్య నమస్కారాలు, యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, దేశంలోని చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకుంటున్నామని తెలిపారు.

### శబరిమలలో అభివృద్ధిపై ప్రశంసలు

కేరళలోని శబరిమల పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ భక్తుల కోసం కల్పించిన పరిశుభ్రత, పారిశుద్ధ్య చర్యలు, మౌలిక సదుపాయాలు తమను ఆకట్టుకున్నాయని బృంద సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం పుణ్యక్షేత్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న మార్పులు, చేర్పులు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. సుమారు 50 మంది సభ్యులతో కూడిన సూర్య నమస్కారాల బృందం ఈ పర్యటనలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక యాత్రతో పాటు చారిత్రక ప్రదేశాలు, ప్రకృతి అందాలను సందర్శించడం ద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నామని బృంద సభ్యులు పేర్కొన్నారు.

# ఐదో అంతస్తు నుంచి పడి కార్మికుడు మృతి

**- సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదం**

**- నాచారం హెచ్‌ఎంటీ నగర్‌లో ఘటన**



**నాచారం (ప్రశ్న న్యూస్)** సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన అర్పుల బప్పన్న (50) మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత సుమారు 20 ఏళ్లుగా రాజేష్ అనే లేబర్ కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 6 గంటలకు బప్పన్న పనికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. హెచ్‌ఎంటీ నగర్‌కు వెళ్తున్నానని తన అక్క అలుక లలితకు చెప్పి వెళ్లాడు. అనంతరం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో బప్పన్నతో కలిసి పనిచేస్తున్న రాము, అతని ఫోన్ నుంచి బప్పన్న కుమారుడు నరేష్‌కు ఫోన్ చేసి, సెంట్రింగ్ పని చేస్తుండగా బప్పన్న కిందపడి స్పందించడం లేదని సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా బప్పన్న అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అక్కడి సహచర కార్మికులను విచారించగా బప్పన్న ఐదో అంతస్తు నుంచి సెంట్రింగ్ బాక్సులను కిందకు దించుతున్న సమయంలో ప్రమాదం జరిగి అదుపుతప్పి కిందపడినట్లు మేస్త్రీ రాజు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు వెల్లడించారు. ఐదో అంతస్తు నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలై బప్పన్న అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై మృతుడి అక్క అలుక లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన తమ్ముడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని, ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు భావిస్తున్నామని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అనీమియా ముక్త్ భారత్ సాధనలో భాగస్వామ్యం కావాలి

**- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** అనీమియా ముక్త్ భారత్ సాధనలో భాగస్వామ్యం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. తార్నాకలోని ఐ సి ఎం ఆర్ - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సమావేశ మందిరంలో మంగళవారం "అనీమియా ముక్త్ భారత్ అభియాన్" లో భాగంగా నిర్వహించిన ప్రకాష్ (ప్రేసిషన్ డ్రైవన్ రెస్పాన్స్ ఫర్ అనీమియా కంట్రోల్ అండ్ సూస్తాయినబ్లె హెల్త్ ) వర్క్‌షాప్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో రక్తహీనత (అనీమియా) నివారణకు సమగ్రమైన, ఖచ్చితమైన కార్యాచరణ అవసరమని తెలిపారు. ఐ సి ఎం ఆర్ - ఎన్ ఐ ఎన్ తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా చేపడుతున్న ఈ 'ప్రకాష్ ' ప్రాజెక్ట్ ద్వారా అనీమియా ముక్త్ భారత్ సాధనలో కీలక అడుగు ముందుకు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ హెమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలి, సరైన పోషకాహారంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లను వినియోగించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ సమాజాన్ని అనీమియా రహితంగా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ వర్క్‌షాప్‌లో వివిధ రంగాల ప్రతినిధులు, వైద్య నిపుణులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొని, అనీమియా నియంత్రణకు అవసరమైన వ్యూహాలపై చర్చించారు.

# ఈనెల 30న జిల్లా విద్యా సదస్సు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ట పరచాలి, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి అని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 30 న ప్రగతినగర్ లోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్ లో జిల్లా విద్యా సదస్సు ను నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల కార్యదర్శి నరేష్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగంలోని విద్యను బలహీన పరుస్తూ, ప్రైవేటీకరిస్తున్నాయని ఆరోపించారు. విద్యా కార్పొరేటీకరణతో ఫీజుల దోపిడీ విచ్చలవిడిగా సాగుతుందని ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు విద్యకు దూరం అవుతున్నారని విమర్శించారు. విద్యలో అంతరాలు ఏర్పడుతున్నాయని . అంతస్తులను బట్టి విద్యను పొందే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఈ రోజుకీ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యనందించడంలో విఫలమైనందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుపడాలి అని హెద్దెవా చేశారు. కొఠారి కమిషన్ (1966) నుంచి నూతన విద్యా విధానం-2020 వరకు విద్యపై కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీ లో కనీసం 6శాతానికి పెంచాలని పదేపదే సిఫారసు చేసినప్పటికీ 2022-23లో కేంద్రం కేవలం జీడీపీ లో 1.09 శాతం మాత్రమే కేటాయించిందని ఆరోపించారు. రాష్ట్రాలు తమ బడ్జెట్లో 30 శాతం కేటాయించాలని అనేక సిఫార్సులు చెబుతుంటే రాష్ట్రాలు 2025-26 సగటు విద్యా కేటాయింపు 14.5 శాతం కాగా, తెలంగాణ 2026-27లో 9.8 శాతం మాత్రమే కేటాయించిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలనుండి తప్పుకుంటున్నాయని ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని, కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టడానికి సమగ్ర ఫీజుల నియంత్రణచట్టం తీసుకురావాలని, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ 30న జిల్లా విద్యాసదస్సును నిర్వహిస్తుందని . ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు, పేరెంట్స్ అసోషియేషన్ ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మేడ్చల్ మండలంలోని ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ మేనేజ్మెంట్ అధ్యక్ష కార్యదర్శులు ట్రెజరర్ కి ఇన్విటేషన్ అందజేశామని నరేష్ తెలిపారు.

# పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిది



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మొక్కలు నాటారు. దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో పరిశ్రమల శాఖ ఫ్యాక్టరీల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదరపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.. పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నివారణకు ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత కోసం పరిశ్రమల యాజమాన్యాలు కూడా సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ వనమహోత్సవం లాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. వినయ్ కుమార్ జాయింట్ డైరెక్టర్/జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ, మనోహర్ రెడ్డి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పరిశ్రమల శాఖ, దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ సంస్థ ప్రతినిధులు రమేష్, గోపినాథ్, సిబ్బంది ఇతర ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కలకు క్యూ ఆర్ కోడ్..

## గజ్వేల్ మహిళా కళాశాలలో వినూత్న హరితహారం



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం వినూత్న రీతిలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటికి ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని చీఫ్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. పి. సౌజన్య, డా. కె. సరోజ సమన్వయంతో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. మొక్కల వివరాలు డిజిటల్‌గా..కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కకు క్యూ ఆర్ కోడ్‌లను రూపొందించి ఏర్పాటు చేశారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆయా మొక్కలకు సంబంధించిన వివరాలను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ వినూత్న విధానం ద్వారా విద్యార్థుల్లో మొక్కల సంరక్షణతో పాటు డిజిటల్ సాంకేతికతపై అవగాహన పెంపొందించేందుకు అవకాశం కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జె. ఉమారాణి, ఐ క్యూ ఏ సి, కోఆర్డినేటర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, అధ్యాపకులు డా. రాజారావు, కస్తూరిబాయి, డా. శోభారాణి, అర్చన, శ్రీలత, సునీత, సుజాత, ఉమారాణి, రమణారెడ్డి తదితరులు ఎన్ ఎస్ ఎస్, వాలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, కళాశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని నాటిన మొక్కలను సంరక్షించడంతో పాటు కళాశాల ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పచ్చదనం--పర్యావరణ పరిరక్షణతో పాటు డిజిటల్ సాంకేతికతను అనుసంధానిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పర్యావరణ స్పృహను పెంపొందించడంలో ప్రత్యేకంగా నిలిచింది.

# గిరిజన గ్రామాలకు రహదారి బాట

**- కోటుపరువులో రూ.52 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

**- డోలీ మోతల రోజులు పోయాయి.. ప్రతి గిరిజన గ్రామానికీ రోడ్డు: మంత్రి సంధ్యారాణి**

**- యరగడవలసలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం**



**సాలూరు(ప్రశ్న న్యూస్)** గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రహదారి సౌకర్యం మెరుగుపడితే గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్ సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సాలూరు మండలం కోటుపరువు పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాలకు రూ.52 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితికి ముగింపు పలకాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.


### డోలీ మోతలకు ముగింపు

గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రహదారి సౌకర్యం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. "గిరిజన గ్రామాలకు డోలీ మోతల రోజులు పోయాయి. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికీ మంచి రోడ్డు, తాగునీరు, విద్యా సదుపాయాలు అందేలా పనిచేస్తున్నాం" అని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనతో గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గిరిజన గ్రామాలకు రహదారులు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారి, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు

# కాపీ రైట్ వివాదంలో తాప్సీ 'గాంధారి' సినిమా..

## స్పందించిన మేకర్స్!




తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాంధారి' విడుదలకి ముందే కాపీ వివాదంలో చిక్కుకుంది. కళ్యాణ్ బండి అనే రచయిత ఈ నెట్‌ఫ్లిక్స్ సినిమా కథ తన కథను పోలి ఉందని ఆరోపిస్తూ లీగల్ నోటీసులు పంపడం కలకలం రేపింది. కళ్యాణ్ బండి మీడియాతో మాట్లాడుతూ.. తాను 2019లోనే ఈ కథను రాశానని, నాటి నెట్‌ఫ్లిక్స్ కంటెంట్ హెడ్ మోనికా షెర్గిల్‌కు లింక్డిన్ ద్వారా సంప్రదించి మెయిల్ ద్వారా కథను పంపినట్లు తెలిపారు. మే నెలలో ఆ కథ తమకు సెట్ అవ్వదని చెప్పడంతో తాను వేరే వాళ్లకు పిచ్ చేసుకున్నానని అన్నారు.


2023 చివరి నాటికి ఒక స్టూడియో తన కథతో థియేట్రికల్ ప్రాజెక్ట్ చేయడానికి ముందుకు వచ్చిందని, అయితే 2024 సెప్టెంబర్‌లో కనిక ధిల్లాన్ రైటర్‌గా నెట్‌ఫ్లిక్స్ 'గాంధారి' టైటిల్ అనౌన్స్ చేయడంతో షాక్ గురయ్యానని చెప్పారు. తాప్సీ సినిమాలో కూడా ఒక తల్లి, యువతుల అదృశ్యం అనే పాయింట్ తన కథలాగే ఉండటంతో మోనికాకు మళ్లీ మెసేజ్ చేసినా స్పందన రాలేదని, ఎస్‌డబ్ల్యూఏ (SWA) సూచన మేరకు లీగల్ నోటీసులు పంపినట్లు కళ్యాణ్ వెల్లడించారు. డిసెంబర్ 2024 నాటికి తన నిర్మాతలు కూడా ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నారని తెలిపారు. అయితే ఈ కాపీ రైట్ ఆరోపణలను కనిక ధిల్లాన్ నిర్మాణ సంస్థ 'కథా పిక్చర్స్' పూర్తిగా ఖండించింది. 'గాంధారి' అనేది పూర్తిగా స్వతంత్రంగా అభివృద్ధి చేసిన ఒరిజినల్ కథ అని, దీని కథ, స్క్రీన్‌ప్లే పూర్తిగా కనిక ధిల్లాన్ సొంతమని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలు నిరాధారమైనవని, వీటిని నిరూపితమైన నిజాలుగా ప్రచారం చేయవద్దని మీడియాను, ప్రేక్షకులను మేకర్స్ కోరారు. కాగా ఈ చిత్రం సెప్టెంబర్ 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది.

# 'ఇరుముడి' రికార్డుల వేట..

## 4 రోజుల్లో రూ.100 కోట్ల గ్రాస్..

### టికెట్ సేల్స్‌లో సరికొత్త సంచలనం!








మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సినిమా కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకుంది. రవితేజ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ఇరుముడి' నిలిచింది. చాలా కాలంగా ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ చిత్రం కెరీర్‌లోనే ప్రత్యేకమైన విజయాన్ని అందించిందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. సాధారణంగా వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చే మొదటి సోమవారం చాలా సినిమాల బుకింగ్స్, ఆక్యుపెన్సీలు తగ్గడం సహజం. కానీ 'ఇరుముడి' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపించింది. విడుదలైన నాలుగో రోజు కూడా సినిమా బుకింగ్స్ బలంగా కొనసాగడంతో ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి రోజు స్థాయికి దగ్గరగా బుకింగ్స్ నమోదవడం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రీజినల్ సినిమాల్లో ఫస్ట్ మండే బుకింగ్స్ పరంగా కూడా ఈ చిత్రం కొత్త రికార్డులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు కేంద్రాల్లో ఆక్యుపెన్సీలు అత్యంత బలంగా నమోదవుతున్నాయి. 'ఇరుముడి' హవా టికెట్ సేల్స్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో కేవలం నాలుగు రోజుల్లోనే 38 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. భారీ స్థాయిలో ప్రేక్షకులు థియేటర్లకు తరలిరావడంతో అనేక ప్రాంతాల్లో షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ తర్వాత కూడా అదే జోరు కొనసాగుతుండటంతో సినిమా లాంగ్ రన్‌పై ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఐదో రోజు అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉండటంతో 'ఇరుముడి' బాక్సాఫీస్ ప్రయాణం మరింత దూకుడుగా సాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని పలు ప్రధాన కేంద్రాల్లో ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి సినిమాకు మంచి స్పందన రావడం చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎమోషన్, కమర్షియల్ ఎలిమెంట్స్, రవితేజ ఎనర్జీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని అభిమానులు చెబుతున్నారు. మొత్తానికి నాలుగు రోజుల్లో రూ.100 కోట్ల గ్రాస్ మైలురాయిని చేరుకున్న 'ఇరుముడి' ఇప్పుడే తన రికార్డుల వేటను ప్రారంభించినట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకెన్ని అరుదైన రికార్డులు తన ఖాతాలో వేసుకుంటుందో చూడాలి.

# 'ఇరుముడి' ఫీవర్..


## - అయ్యప్ప గెటప్‌లో డేవిడ్ వార్నర్!



ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అభిమానం ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన ఒక ఫ్యాన్-ఎడిటెడ్ పోస్ట్ నెట్టింట తెగ వైరలవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని ప్రముఖ ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్ పేజ్ 'ఆరెంజ్ ఆర్మీ ఫేవరెట్' సృష్టించిన ఈ పోస్ట్‌లో వార్నర్‌ను భక్తి శ్రద్ధలతో కూడిన అయ్యప్ప భక్తుడి గెటప్‌లో చిత్రించారు. మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రంలో ఆయన అయ్యప్ప భక్తుడిగా కనిపించగా, సరిగ్గా అదే గెటప్‌లో వార్నర్‌ను ఊహిస్తూ అభిమానులు ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఈ క్రియేటివ్ ఫ్యాన్-ఆర్ట్ నటుడు డేవిడ్ వార్నర్‌ను ఎంతగానో ఆకట్టుకోవడంతో, ఆయన స్వయంగా తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. మరోవైపు, మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా సంచలనం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద తన జోరును ఏమాత్రం తగ్గించడం లేదు. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన అందుకుంటున్న ఈ ఎమోషనల్ యాక్షన్ డ్రామా.. వరుసగా బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొడుతూ దూసుకుపోతోంది. ఇప్పటికే తొలి వీకెండ్‌లోనే రూ.80 కోట్ల గ్రాస్ మార్క్‌ను అత్యంత వేగంగా అందుకున్న ప్రాంతీయ చిత్రాల్లో ఒకటిగా నిలిచిన ఈ సినిమా, తాజాగా మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 2026 సంవత్సరంలో విడుదలైన తెలుగు సినిమాల్లో తొలి ఆదివారం నాడు అత్యధిక మంది ప్రేక్షకులు థియేటర్లకు వచ్చిన చిత్రంగా 'ఇరుముడి' సరికొత్త రికార్డు సృష్టించింది. థియేటర్ల వద్ద ప్రేక్షకుల తాకిడి పెరుగుతుండటంతో టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లో ఈ సినిమా ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

## ఇమ్రాన్ హష్మీ 'గన్‌మాస్టర్ జి9'

# టీజర్ విడుదల!




బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ అభిమానులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గన్‌మాస్టర్ జి9' టీజర్ తాజాగా విడుదలైంది. ఈ టీజర్‌లో ఇమ్రాన్ హష్మీ ఒకవైపు అదిరిపోయే యాక్షన్ స్టంట్స్‌తో, మరోవైపు ఇంటెన్స్ లవర్ బాయ్ లుక్‌లో కనిపించి ప్రేక్షకులను కట్టిపడేశారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ సరసన నటి జెనీలియా దేశ్‌ముఖ్ కథానాయికగా నటిస్తుండటం విశేషం. వీరితో పాటు ప్రముఖ నటుడు అపశక్తి ఖురానా కీలకమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు ఆదిత్య దత్ తెరకెక్కిస్తుండగా.. హిమేష్ రేషియా సంగీతం అందించబోతున్నాడు. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన 'ఆషిక్ బనాయా ఆప్నే' సినిమా ఎలాంటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు మళ్ళీ అదే మ్యాజికల్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ సినిమాను నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు ఇమ్రాన్ హష్మీ నటించిన రీసెంట్ మూవీ 'ఆవారాపాన్ 2' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతుంది. ఇప్పటికే ఈ చిత్రం రూ.180 కోట్ల వసూళ్లను రాబట్టి రూ.200 కోట్ల దిశగా దూసుకెళుతుంది.

# కంగనాతో గొడవపై తాప్సీ ఫైర్..

## ఆ ప్రశ్నలు ఆపితేనే వివాదం ముగుస్తుంది!

బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, విలక్షణ నటి తాప్సీ మధ్య మాటల యుద్ధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తాజాగా ఈ వివాదంపై తాప్సీ మరోసారి స్పందించారు. అయితే ఈసారి ఆమె తన అసహనాన్ని మీడియాపై ప్రదర్శించడం గమనార్హం. తమ మధ్య గొడవ ఇంకా రగులుతూనే ఉండటానికి మీడియానే కారణమని ఆమె ఆరోపించారు. తాప్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాంధారి'. మంగళవారం ముంబైలో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓ విలేకరి, కంగనాతో ఆమెకున్న వివాదం గురించి ప్రశ్నించారు. దీనికి స్పందించిన తాప్సీ, మీడియా తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ విషయాన్ని మీరెందుకు ముగియనివ్వరు? మా ఇద్దరినీ ఈ ప్రశ్న అడగడం ఆపినప్పుడే ఈ వివాదం ముగుస్తుంది. బహుశా ఇదంతా చూసి మీరంతా ఆనందిస్తున్నట్టున్నారు. అందుకే పదే పదే అవే ప్రశ్నలు అడుగుతున్నారు. మీరు ఇలాంటి ప్రశ్నలు అడగటం ఆపేస్తే ఈ గొడవ ఎప్పుడో ముగిసిపోయేది" అని తాప్సీ ఘాటుగా సమాధానమిచ్చారు. కొద్ది రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో తాప్సీ, కంగనాతో తనకున్న సంబంధం గురించి మాట్లాడుతూ.. ఆమె మాట్లాడే తీరు ఆమె పెంపకాన్ని ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై కంగనా తీవ్రంగా స్పందించారు. పేరు ప్రస్తావించకుండా తాప్సీని "సస్తీ కాపీ" (చౌకబారు నకలు) అని విమర్శిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "ఓ సస్తీ కాపీ తన బి-గ్రేడ్ సినిమాతో ముందుకొచ్చింది. కానీ ఎప్పటిలాగే మీడియాలో హెడ్‌లైన్ మాత్రం కంగనా రనౌత్ గురించే. నా తల్లిదండ్రులు, వారి పెంపకాన్ని అపహాస్యం చేసే స్థాయికి దిగజారింది. నా తల్లిదండ్రులలాగా ఒరిజినల్‌ను కనలేకపోయారని ఆమె తల్లిదండ్రులను నేను కూడా అడగాలనుకుంటున్నాను. ఎందుకు ఇంత చీప్ కాపీ?" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను రాజ్‌పుత్ జమీందార్ కుటుంబం నుంచి వచ్చినా, సొంతంగా ఎదగాలని నిర్ణయించుకున్నానని, దానికోసం తన తల్లిదండ్రులను నిందించడం దారుణమని అన్నారు. అయితే, ఆ తర్వాత కంగనా ఆ పోస్ట్‌ను డిలీట్ చేశారు. 2019లో కంగనా సోదరి రంగోలి చందేల్, తాప్సీని తొలిసారి "సస్తీ కాపీ" అని సోషల్ మీడియాలో సంబోధించడంతో వీరి మధ్య వివాదం మొదలైంది. అప్పటి నుంచి ఏదో ఒక రూపంలో ఈ మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. తాజాగా తాప్సీ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరోసారి బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.



# మలయాళంలో బ్లాక్‌బస్టర్..

## తెలుగులోకి నివిన్ పౌలి, మమితా బైజు 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'!

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది. యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టిపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




## తెలంగాణలో 'టాక్సిక్' సినిమా టికెట్ ధరల

# పెంపునకు అనుమతి



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' విడుదలకు సిద్ధమైంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 చొప్పున పెంచుకోవచ్చుని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పెంపు మొత్తాల్లో జీఎస్టీ కూడా కలిపి ఉంటుంది. పెంచిన టికెట్ ధరలు 10 రోజుల పాటు అమల్లో ఉంటాయి. ఈ సమయంలో రోజుకు 5 షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో 'టాక్సిక్' నిర్మాణ సంస్థ కేవీయన్ ప్రొడక్షన్స్ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీకి రూ.కోటి డిపాజిట్ చేయాలని ప్రభుత్వం సూచించింది. నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హ్యూమా ఖురేషి కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. వైవిధ్యమైన యాక్షన్ థ్రిల్లర్‌గా గీతూ మోహన్‌దాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచార చిత్రాలను బట్టి తెలుస్తోంది. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో 'టాక్సిక్' విడుదల కానుంది. ఈ సినిమా నిడివి 3 గంటల 14 నిమిషాలు.

# మెదక్ జిల్లా హెరిటేజ్ టూరిజం యొక్క కీర్తిని

# నలుదిక్కులా చాటే విధంగా లోగో బ్రాండింగ్ ఏర్పాటు

**- మొదటి విడత టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో 10 ఎజెండా అంశాలపై చర్చ**

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా టూరిజం అభివృద్ధిపై మంగళవారం కలెక్టరేట్లో మొదటి విడత టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడారు 07 కోట్ల రూపాయలతో ఏడుపాయల ఆవరణలో 12 కాటేజీల నిర్మాణం చేపట్టుటకు సంబంధించి టూరిజం శాఖ ద్వారా స్థల సేకరణ పూర్తి చేసి నిర్మాణ బాధ్యతలను టూరిజం, జిల్లా పంచాయతీ శాఖకు అప్పగించేలా కార్యచరణతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. మెదక్ పోర్టు అభివృద్ధిలో భాగంగా ప్రధాన రక్షణ, సెక్యూరిటీ గాడ్స్ నియామకం,టూరిస్ట్ గైడ్ ఏర్పాటు హౌస్ కీపింగ్, యాత్రికుల టికెట్, పార్కింగ్ అంశాలపైచర్చించామన్నారు.ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటన్నిటిని ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించి రక్షణ కంచే నిర్మించి పోర్ట్ ఏరియాలో పార్కింగ్ కనుకూలంగా తీర్చిదిద్దాలన్నారు వీటన్నిటిని మెదక్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతగా తీసుకోవాలని కమిటీ నిర్ణయించిందని చెప్పారు. జిల్లాలో ఉన్న మెదక్ పోర్టు, ఏడుపాయల వన దుర్గ భవాని దేవాలయం, పోచారం, వేల్పుగొండ, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఈ ఏరియాలలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి సందర్శకులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవడం, కొన్ని ప్రాంతాలలో మొబైల్ ఫుడ్ వాహనాలు ఏర్పాటు చేసే కార్యచరణతోపటిష్టచర్యలు తీసుకుంటున్నామన్నారు.యాత్రికులు వీక్షణకు సంబంధించి రాష్ట్రస్థాయిలో హెరిటేజ్ డిపార్ట్మెంట్ సూచనలను పరిగణలోకి తీసుకుని మెదక్ పోర్టు వీక్షణకు యాత్రికులకు పెద్దలకు 20 రూపాయలు, పిల్లలకు 05 రూపాయలు టికెట్ ధర నిర్ణయించడం జరిగిందన్నారు.స్వదేశీ దర్శన్ లో భాగంగా మెదక్ పోర్టు పోచారం ఈ రెండు కూడా ఇటీవల కేంద్ర బృందం సందర్శించడం జరిగిందని త్వరలోనే కేంద్రం ద్వారా అనుమతి లభిస్తే 100 కోట్లు మంజూరు అవుతాయని ఈ నిధులతోటి మెదక్ టూరిజం విశేషంగా అభివృద్ధి చెంది యాత్రికులకు సకల సౌకర్యాలు కల్పించి మెదక్ టూరిజం అభివృద్ధి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది అన్నారు ఏడుపాయల టెంపుల్ ఆవరణలో అసైన్డ్ ల్యాండ్లను గుర్తించి వాటిలలో ఫుడ్ కోర్టు, పార్కింగ్ ఏరియాలో ఏర్పాటు దిశగా కార్యచరణ రూపొందించాలన్నారు మెదక్ పోర్టు వీక్షించడానికి పైకి వెళ్లడానికి యాత్రికుల సౌకర్యాంతంగా ఉండటానికి బ్యాటరీ వాహనం ఏర్పాటు చేయడానికి కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు.ప్రస్తుతం వచ్చిన 57 లక్షలు నిధులతో హెరిటేజ్ డిపార్ట్మెంట్ వారు పనులు టేకప్ చేయడానికి సీసీటీవీ కెమెరాల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతుందని, అలాగే మిగతా మరమ్మత్తులకు వసతులకు 21 లక్షలు కేటాయిస్తూ టెండర్ కాల్ ఫర్ చేయడం జరిగిందన్నారు. టూరిస్ట్ గైడ్లకు సంబంధించి జిల్లా నుండి 5 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని వారు ప్రస్తుతం శిక్షణలో ఉన్నారని శిక్షణ అనంతరం నిబంధనల మేరకు నియమించడం జరుగుతుందన్నారు సెక్యూరిటీ గార్డుల నియామక విషయంలో ఏజెన్సీల ద్వారా తీసుకోవడానికి మెదక్ మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది చారిత్రాత్మక ప్రదేశాలలో గైడ్లను నియమించి మెదక్ టూరిజం అభివృద్ధిని యాత్రికులకు పూర్తి సమాచారంతో చారిత్రాత్మక వైభవాన్ని కళ్ళకు కట్టినట్లు అందించే విధంగా చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించామన్నారు.హోం స్టే సంబంధించి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల ను గుర్తించి శిక్షణ ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.మెదక్ జిల్లా టూరిజం అభివృద్ధి నలుదిక్కుల చాటే విధంగా చారిత్రాత్మక వైభవం సంతరించుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక (టూరిజం) మరియు సంస్కృతి శాఖా మంత్రిగా జూపల్లి కృష్ణారావు గారి ఆదేశాలు, , మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు గారి సహాయ సహకారాలు , టూరిజం సెక్రెటరీ వాణి ప్రసాద్ గారి సలహాలు సూచనలు స్వదేశీ దర్శన్ లో కేంద్రం ద్వారా నిధులు మంజూరుకు ఎంపీ గారి చొరవ వీరందరూ సహకారంతో



టూరిజం అభివృద్ధి వడివడిగా ముందుకు పోతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు,టూరిజం అధికారి రమేష్ , ఈడియం సందీప్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈ సమావేశానికి హైదరాబాదు నుండి వక్కువల్గా రాష్ట్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకులు ఓం ప్రకాష్, హెరిటేజ్ డిపార్ట్మెంట్ టెక్నికల్ డైరెక్టర్ డి మల్లు, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డిఇ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**- పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి.**

**- మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు.**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ జో.జి , డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి తో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు .19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి .60.83 %.శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినిలు అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాద కేసులో ముగ్గురికి ఆరు నెలల జైలు శిక్ష




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** భూ వివాదానికి సంబంధించి యువతిపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషించిన కేసులో ముగ్గురు నిందితులకు గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3,500 చొప్పున జరిమానా విధించింది.వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామానికి చెందిన పుల్ల నవీన (21) బీటెక్ విద్యార్థిని. 2020 ఏప్రిల్ 8న భూ వివాదానికి సంబంధించి నిందితులు ఆమెతో పాటు కుటుంబ సభ్యులతో గొడవకు దిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులు ఆమెను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు జుట్టు పట్టుకుని కర్రతో కొట్టారని, ఛాతీపై చేయి వేసి నేలపైకి లాగి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొంది.అదే సమయంలో ఆమె సోదరుడిపై కూడా దాడి చేయగా, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమె తల్లిని సైతం నిందితులు జుట్టు పట్టుకుని బురదలోకి లాగి చేతులతో కొట్టినట్లు ఫిర్యాదులో తెలిపింది. ఈ ఘటనలో ఎర్ర మల్లయ్య కుమారుడు బాలకోటి, బుచ్చి మల్లయ్య కుమారుడు కర్రె అనిల్ జోక్యం చేసుకుని బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులను నిందితుల నుంచి రక్షించినట్లు పేర్కొంది. ఘటనకు సంబంధించిన ఫోటోలు తన వద్ద ఉన్నాయని నవీన పోలీసులకు తెలిపింది.గ్రామ పెద్దలను సంప్రదించిన కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగిందని ఆమె వివరించింది. అనంతరం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కేసులో పూర్తి స్థాయి విచారణ అనంతరం గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మూల స్వాతి గౌడ్ ముగ్గురు నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.కేసు దర్యాప్తు అధికారిగా అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన పీ. సంగమేశ్వర్ (ప్రస్తుతం పదవీ విరమణ) వ్యవహరించారు. అనంతరం కేసు విచారణలో గజ్వేల్ ఇన్స్పెక్టర్ వీ. రవికుమార్ కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి ఆర్. మాధవి వాదనలు వినిపించారు.కోర్టు తీర్పుతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందని, నేరాలకు పాల్పడితే చట్టపరంగా శిక్ష తప్పదని పోలీసులు పేర్కొన్నారు.

## వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు చోరీ.

## నిందితుడు అరెస్ట్.. బంగారు ఆభరణం స్వాధీనం.



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు ను బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్ మీడియా తో మాట్లాడుతూ పట్టణంలో సాయి నగర్ కాలనీ కి చెందిన 68 ఏళ్ల బాలెశెట్టి సులోచన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ నెల 22/23వ తేదీ అర్ధరాత్రి సుమారు 2.40 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తలుపు కొట్టాడు. సులోచన తలుపు తెరవగానే బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడు ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో సులోచన బంగారు గొలుసును గట్టిగా పట్టుకోవడంతో అది తెగిపోయింది. కొంత బంగారం ఆమె చేతిలో మిగలగా, మిగిలిన ఆభరణాన్ని నిందితుడు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమె కేకలు విని పై అంతస్తులో నివసిస్తున్న అల్లుడు కె. లింగ గౌడ్ కిందకు వచ్చేలోపే నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. చోరీ కి గురైన బంగారు ఆభరణం విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి కుమారుడు బాలెశెట్టి సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 378/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానితుల పై నిఘా పెట్టడంతో పాటు మెదక్ పట్టణంలోని బంగారు దుకాణాలపై కూడా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం దయారా స్ట్రీట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చాకలి మొగులయ్య (34), తండ్రి చంద్రయ్య, తోగిట గ్రామం, హవేలీ ఘనపూర్ మండలంగా గుర్తించారు. విచారణలో సులోచన ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బంగారాన్ని విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మెదక్ పట్టణానికి వస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు వెల్లడించారు. నిందితుడి పై గతంలో ఆటో దొంగతనం, రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై

## డీపీఓతో సీఐటీయూ నేతల చర్చలు



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)తో చర్చించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించాలని సీఐటీయూ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బాలనరసయ్య, కార్యదర్శి మహేష్ తో పాటు పలువురు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## గంగపుత్ర మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



వరంగల్(ప్రశ్న న్యూస్) ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకంలో గంగపుత్ర మహిళలకు కూడా అవకాశం కల్పించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ గంగపుత్ర సంఘం గ్రేటర్ వరంగల్ మహిళా అధ్యక్షురాలు పొక్కుల సరోజన గంగపుత్ర వారి కార్యవర్గ సభ్యులను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అభినందించారు.గంగపుత్ర మహిళల ఆర్థిక స్వావలంబన ఉపాధి అవకాశాల కోసం సరోజన గంగపుత్ర చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన గంగపుత్ర మహిళలకు అందేలా సంఘం తరఫున నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.గంగపుత్ర మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్లలో తగిన ప్రాధాన్యత కల్పించి వారి జీవనోపాధికి ప్రభుత్వం సహకరించాలని టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లిన పొక్కుల సరోజన గంగపుత్ర వారి కార్యవర్గానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మీసేవ, ఆధార్ సెంటర్ల తనిఖీ.

**- అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం: అధికారుల హెచ్చరిక.**

**- అధిక రుసుము వసూళ్లపై కఠిన చర్యలు.**

**- ప్రజలతో మర్యాదగా ఉండాలని నిర్వాహకులకు ఆదేశం.**




**ఏటూరు నాగారం(ప్రశ్నన్యూస్)** ఏటూరు నాగారం మండలంలోని మీసేవ మరియు ఆధార్ సెంటర్లను తహశీల్దార్ జగదీశ్వర్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్ సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇటీవల పలు పత్రికలు, న్యూస్ ఛానళ్లలో మీసేవ కేంద్రాల్లో అధిక రుసుము వసూళ్లు జరుగుతున్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల నుంచి నిర్ణీత రుసుము కంటే అదనంగా ఒక్క రూపాయి కూడా తీసుకోవద్దని సెంటర్ నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు.

### అక్రమాలకు సహించం.

అక్రమ దందాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తహశీల్దార్ జగదీశ్వర్ స్పష్టం చేశారు. ఆధార్ సెంటర్లలో అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పేర్కొన్నారు. నిర్ణీత రుసుముకు మించి వసూలు చేసినట్లు తేలితే సంబంధిత సెంటర్ పై సస్పెన్షన్ తో పాటు జరిమానా కూడా విధిస్తామని తెలిపారు.

### మార్గదర్శకాలు పాటించాలని సూచన.

మీసేవ కేంద్రాలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఈ ఎస్ డి గైడ్ లైన్స్ ప్రకారం నిర్వహించాలని అధికారులు సూచించారు. సెంటర్లలో తప్పనిసరిగా సిటిజన్ చార్టర్, భూభారతి ఫ్లెక్సీలు, మీసేవ లోగో, తహశీల్దార్, ఈడీఎం మరియు పరిష్కారం కాల్ సెంటర్ నంబర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. కళ్యాణలక్ష్మి, యు డి ఐ డి జనన–మరణ ధృవీకరణ పత్రాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, దరఖాస్తుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ అన్ని ఆన్ లైన్ సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ తో పాటు మీసేవ, ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# నీలపు వంశీ మాతృమూర్తి గోవిందమ్మకు ఘన నివాళి

**- ఈనెల 27 గురువారం పెద్దకర్మ నిర్వహణ**

**- ఆత్మీయులు, బంధువులు హాజరుకావాలని పిలుపు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగు రాష్ట్రాలకు సుపరిచితులు ప్రముఖ సామాజిక కార్యకర్త నీలపు వంశీకి మాతృవియోగం కలిగింది.

ఈ మేరకు గురువారం 27 ఆగస్టున భీమవరంలోని జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్ సమీపంలో పెద్దకర్మ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బంధువులు , ఆత్మీయులు హాజరు కావాలని కోరుతున్నట్లు వంశీ కుటుంబీకులు తెలిపారు. ఆగస్టు 27 గురువారం తన తల్లికి హృదయాంజలి ఘటిస్తామని , ప్రార్థనలు చేస్తామని తెలిపారు.

# వైద్యం ముసుగులో

# నకిలీ డాక్టర్లు

## 11 మంది ఫేక్ డాక్టర్ల గుట్టురట్టు

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ డాక్టర్లు
- హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు
- ఇంక నకిలీ డాక్టర్లను గుర్తించాలని ప్రజల విన్నపం








**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో నకిలీ వైద్యుల దందా మరోసారి వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. మెడిసిన్ చదవకుండానే ఫేక్ సర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజలకు వైద్యం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఆ నకిలీ డాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం నిందితుల్లో కొందరు ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ యూనివర్సిటీల పేర్లతో రూపొందించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను ఉపయోగించి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మరికొందరు ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేర్లను ఉపయోగిస్తూ రోగులకు వైద్యం అందిస్తున్నారనే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వైద్య విద్యకు సంబంధించిన సరైన అర్హతలు లేకపోయినా అల్లోపతి వైద్యం చేస్తూ.. రోగులకు మందులు, ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ వంటి మందులు ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో 11 మంది నకిలీ డాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నకిలీ సర్టిఫికెట్లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, అనుమతి లేని మందులు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఎక్కడెక్కడ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు, నకిలీ సర్టిఫికెట్లను ఎక్కడి నుంచి పొందారు ఎంతకాలంగా ఇలా నకిలీ డాక్టర్లు వైద్యం చేస్తున్నారు ఎంతమంది రోగులకు చికిత్స అందించారు అనే అంశాలపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా నకిలీ విద్యా సర్టిఫికెట్లను తయారు చేసి సరఫరా చేస్తున్న ముఠా ఏదైనా ఉందా అనే కోణంలోనూ విచారణ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక భారీగా నకిలీ వైద్యుల బాగోతం బయటికి రావడంతో నగర ప్రజలకు పోలీసులు పలు కీలక సూచనలు చేశారు. అర్హతలు లేని వ్యక్తుల వద్ద చికిత్స తీసుకోవడం ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా వైద్యుడి అర్హతలు, రిజిస్ట్రేషన్ వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే వారి వద్ద చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలోనూ హైదరాబాద్‌లోని బౌరంపేట్, దుండిగల్, సూరారం వంటి ప్రాంతాల్లో సరైన వైద్య అర్హతలు లేకుండా ప్రాక్టీస్ చేస్తున్న వారిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కఠిన చర్యలు తీసుకుంది. కొందరు రోగులకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటి మందులను అనుమతి లేకుండానే అందిస్తున్నట్లు అప్పట్లో గుర్తించడం సంచలనం రేపింది. తాజాగా ఒకేసారి 11 మంది నకిలీ డాక్టర్లు పట్టుబడటంతో హైదరాబాద్‌లో వైద్య సేవలపై అధికారులు మరింత నిఘా పెంచే అవకాశం కనిపిస్తోంది. ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# దేశంలో విభిన్న వాతావరణం

- ఉత్తరాదిన భారీ వర్షాలు, దక్షిణాదిన పొడి వాతావరణం




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలోని వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక అంచనాలను వెల్లడించింది. రానున్న రోజుల్లో ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే సమయంలో పశ్చిమ, దక్షిణ భారత రాష్ట్రాల్లో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. ఝార్ఖండ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈ వాతావరణ మార్పులు సంభవిస్తున్నట్లు తెలిపింది. ఐఎండీ నివేదిక ప్రకారం, అల్పపీడన ప్రభావంతో తూర్పు ఉత్తరప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రానున్న మూడు రోజుల పాటు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు, దక్షిణాది రాష్ట్రాల్లో రానున్న వారం రోజుల పాటు వర్షపాతం గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేసింది. మధ్య భారతదేశంలోని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఆగస్టు 29 వరకు, ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 31 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ అల్పపీడనం రేపటి ఉదయానికి పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని పేర్కొంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించగా, పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రానున్న మూడు రోజుల పాటు ఢిల్లీలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

# 30 రోజులు.. 83 లక్షల ఇళ్లు

- కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'




**అమరావతి (ప్రశ్న న్యూస్)** తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం 30వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కూడా ఈ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 2,29,354 ఇళ్లను సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 83.93 లక్షల కుటుంబాలను టీడీపీ శ్రేణులు కలిసినట్లు అయింది. ప్రతి గడపకూ వెళ్లి, ప్రభుత్వ పనితీరును వివరిస్తూ, వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న స్పందన, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పార్టీ నాయకులు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ కార్యక్రమం మరింత విస్తృతంగా కొనసాగుతోందని, టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు.

# గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో

# మరో నాలుగంతస్తుల భవనం నేలమట్టం

- కూలిన భవనం పక్కన ప్రమాదకర నిర్మాణాలపై హైడ్రా కొరడా
- నాలాపై అక్రమ నిర్మాణాలే అసలు కారణమా.?
- నగరంలో మరిన్ని అక్రమ నిర్మాణాలు గుర్తించేందుకు సిద్ధమైన హైడ్రా
- అధికారుల పరిశీలనలో సంచలన అంశాలు





### రెండు అంతస్తులకు అనుమతి.. ఏడంతస్తుల నిర్మాణమా.?

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ ప్రాథమిక పరిశీలనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. కొంతమేర వరద కాలువను ఆక్రమించి 50 గజాల స్థలాల్లో ఏడెనిమిది అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టడం వల్ల భవనాల పటిష్టత దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రెండు అంతస్తులకు మాత్రమే అనుమతులు తీసుకుని, అందుకు అనుగుణంగానే పిల్లర్లు, పునాదులు వేసి ఆపై అదనపు అంతస్తులు నిర్మించడం భవనాల సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు.





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా కొనసాగుతోంది. మూడు రోజుల క్రితం నాలాపై నిర్మించిన ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిన ఘటనతో అప్రమత్తమైన అధికారులు, ప్రమాదకరంగా మారిన పక్క భవనాలపై దృష్టి సారించారు. ఇప్పటికే ఒక భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేసిన హైడ్రా అధికారులు తాజాగా మరో నాలుగంతస్తుల భవనం కూల్చివేతకు శ్రీకారం చుట్టారు. బాహుబలి క్రేన్ సహాయంతో అత్యంత జాగ్రత్తగా కూల్చివేత పనులు చేపడుతున్నారు.

### ఏడంతస్తుల భవనం కూలడంతో తెలంగాణ వ్యాప్తంగా కలకలం

అంజయ్యనగర్‌లో కేవలం 50 గజాల స్థలంలో నాలాను ఆక్రమించి ఏడంతస్తుల భవనం నిర్మించడం, ఆ భవనం కుప్పకూలడంతో తీవ్ర కలకలం రేగింది. భవనం కూలిన ఘటనలో పక్కనే ఉన్న పలు నిర్మాణాలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించి తొలగించే పనిని అధికారులు వేగవంతం చేశారు. ఆదివారం, సోమవారం వరుసగా కూల్చివేతలు కొనసాగాయి.

### అర్ధరాత్రి వరకు కొనసాగిన ఆపరేషన్

కూల్చివేత పనులు ఆదివారం సాయంత్రం ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగాయి. అయితే కూల్చివేతల కారణంగా డిస్ట్రబెన్స్ ఏర్పడుతోందని స్థానికులు చెప్పడంతో అధికారులు కొంతసేపు పనులు నిలిపివేశారు. సోమవారం ఉదయం తిరిగి పనులు ప్రారంభించారు. చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లు, నివాస భవనాలు ఉండటంతో శిథిలాలు ఇతర నిర్మాణాలపై పడకుండా హైడ్రా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

### మరిన్ని భవనాలపై ఫోకస్

కూలిన భవనం పక్కనే మరికొన్ని భవనాలు కూడా ప్రమాదకర స్థితిలో ఉన్నాయని స్థానికులు హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అధికారులు ఆయా నిర్మాణాలను పరిశీలించారు. అవసరమైతే వాటినీ తొలగిస్తామని స్పష్టం చేశారు. దీంతో అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల యజమానుల్లో ఆందోళన మొదలైంది. దానితోపాటు నగరంలో కొన్ని కీలక ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు కూల్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి తీవ్ర విజ్ఞప్తులు వస్తున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు

ఏళ్ల తరబడి నిర్మాణాలు కొనసాగుతున్నా అక్రమ అంతస్తులు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల కంటికి కనిపించలేదా.? నాలాపై నిర్మాణాలు జరుగుతున్న సమయంలోనే అడ్డుకోకుండా ఇప్పుడు భవనాలు కూలిన తర్వాత మేల్కొనడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు ఒక స్థాయికి తీసుకుని నిర్మాణాలు మాత్రం అనేక అంతస్తులకు పెంచుతున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేశారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాల వద్ద లక్షలలో వసూలు చేశారని వాళ్ళ పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ సోమవారం కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. ఇకపై ప్రమాదకర నిర్మాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. అంజయ్యనగర్ ఘటనతోనైనా నాలాలు, వరద కాలువలు ఆక్రమించి నిర్మించిన అక్రమ భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేరు కానీ.. విదేశీ విద్య అందిస్తారంట

- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన బండి సంజయ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అలాంటప్పుడు విదేశీ విద్యను అందిస్తామని, ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రాష్ట్రానికి రప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఫీజు బకాయిలు అందకపోవడంతో రాష్ట్రంలో అనేక కళాశాలలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని బండి సంజయ్ తెలిపారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, అయినా సీఎంకు పట్టకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు. బకాయిలు అడిగిన కళాశాల యాజమాన్యాలను బెదిరించడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఈ రీయింబర్స్‌మెంట్ నిలిచిపోవడం వల్ల ముఖ్యంగా దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకేసారి (వన్ టైం సెటిల్‌మెంట్) బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. హామీలు ఇచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతోందని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తలెత్తే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588